ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024





ఎండిపోతున్న వేరుశనగ పంట

రైతు కంట.. కోతల కన్నీరు...

- 9 గంటలన్నారు.. ఇస్తోంది ఐదారు గంటలే
- వేసవి మొదలు కాకనే.. కరెంటు కోతలు మొదలయ్యాయి
- దిక్కుతోచని స్థితిలో రైతులు





పళ్లెంలో అన్నం ఉన్నా.. తినడానికి వీలు లేకుండా నోరు కట్టేస్తే.. ఎట్లా ఉంటుందో? ప్రస్తుతం జిల్లాలో రైతుల పరిస్థితి అట్లే ఉంది. రైతులకు వ్యవసాయం కోసం 9 గంటలు కరెంటు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. తీరా ఇప్పుడేమో.. రోజుకు ఐదారు గంటలు మించి ఇవ్వడం లేదు. బోర్లలో నీళ్లున్నా.. అవి బయటకు వచ్చే మార్గం కనిపించక రైతులు అల్లాడుతున్నారు. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు కరెంటును నమ్ముకుని పంటలు సాగు చేయడానికి ధైర్యం చేయలేకున్నారు. సక్రమంగా కరెంటు రాక.. వచ్చినా.. వేళాపాళా లేక.. కళ్ల ముందే.. పంటలు ఎండిపోతుంటే.. రైతుల కంట కన్నీరు కారుతోంది.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరెంట్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడో పోతుందో తెలియడం లేదు. వేసవి కాలం ఇంకా రాక ముందే విద్యుత్ కోతలు మొదలు కావడంతో ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోని ప్రజలు, రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇక వ్యవసాయానికి ప్రభుత్వం ఇస్తామంటున్న 9 గంటల విద్యుత్ సరఫరా ఎక్కడా కనిపించడం లేదు. దీంతో పంటలు ఎండిపోతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. చిన్నమండెం మండలంలో 7 గంటలు మాత్రమే రైతులకు వ్యవసాయానికి కరెంటు ఇస్తున్నారు. గత వారంలో బుధ, గురువారం నాలుగు గంటలు, మూడు గంటలు మాత్రమే కరెంటు ఇచ్చారు. టమోటా సీజన్ ప్రారంభం కావడంతో చిన్నమండెం మండలంలో రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి టమోటా మొక్కలు తెచ్చారు. అయితే కరెంటు లేక మొక్కలు నాటలేకపోవడంతో ఎండిపోతున్నాయి. ఈ విధంగానూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని ఒకటి రెండు సబ్‌స్టేషన్‌లలో పగలు రెండు మూడు గంటలు కరెంటు ఇస్తున్నారు. మిగిలిన కరెంటును రాత్రి పూట ఇస్తున్నారు. దీంతో రాత్రి పూట టమోటా మొక్కలు ఎలా నాటుకోవాలని రైతులు వాపోతున్నారు. 9 గంటలు కరెంటు ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా విద్యుత్ సరఫరా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితి కేవలం చిన్నమండెం మండలానికే పరిమితం కాకుండా దాదాపు జిల్లా అంతటా ఉందని పలువురు పేర్కొంటున్నారు. జిల్లాలో దాదాపు లక్షకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే పంటలు సాగు చేసిన వాళ్లు.. సాగు చేయడానికి సిద్ధం అవుతున్న వాళ్ల పరిస్థితి దారుణంగా ఉందని చెప్పవచ్చు.

కరెంటు కష్టాలు ఎప్పటికి తప్పుతాయో

- రెడ్డినాయక్, రైతు, నల్లగుట్టపల్లె, సుండుపల్లె



కరెంటు కష్టాలు జీవితకాలం మాకు తప్పేలా లేదు. అసలే ఎండ తీవ్రతతో తాగు, సాగునీటి కష్టాలు ఎక్కువగా ఉన్నాయి. పింఛా ప్రాజెక్టులో నీరు లేకపోవడంతో సాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాము. వరి పంట, వేరుశనగ పంటలతో పాటు మామిడి తోట ఉంది. నెలకు రెండు తడులు నీరు అందించాలి. కరెంటు సమయానికి లేకపోవడంతో పంటలకు నీరు అందించలేకున్నా. ఈ కరెంటు కష్టాలు ఎప్పటికీ తప్పుతాయో అర్థం కావడం లేదు. రైతులకు మంచి చేస్తామని చెబుతున్నారు. ఏ రైతుకు మంచి జరిగిందీ లేదు. నాణ్యమైన కరెంటు అందించి పుణ్యం కట్టుకోండి.

కరెంటు కోతలతో ఇబ్బంది

- లక్ష్మన్న, రైతు ఎర్రప్పగారిపల్లె, నిమ్మనపల్లి మండలం



కోతల కరెంటుతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం 9 గంటల కరెంటు అని చెబుతూ వ్యవసాయానికి కేవలం 6 గంటలు మాత్రమే ఇస్తున్నారు. దీనికి తోడు వాళ్లకు ఇష్టం వచ్చినపుడు కరెంటు నిలిపివేస్తుండటంతో మేము చాలా ఇబ్బందులు పడుతున్నాం. కనీసం దుక్కులు దున్ని పంట వేయడానికి వెనుకంజ వేస్తున్నాం. రాబోయే రోజుల్లో సక్రమంగా కరెంటు వస్తుందన్న నమ్మకం లేదు.

ఏడు గంటలు నిరంతరాయంగా ఇవ్వడం లేదు

- రెడ్డెప్ప, గుంతలపేట, రామసముద్రం



వ్యవసాయ బోర్లకు రోజుకు 9 గంటలు ఇవ్వాలి. అయితే ఆరేడు గంటలే ఇస్తున్నారు. అది కూడా నిరంతరాయంగా సరఫరా ఉండడం లేదు. ఈ ఏడాది ఎండలు ఫిబ్రవరిలోనే ఎక్కువగా ఉన్నాయి. రాబోయే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింతగా పెరగవచ్చు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరా మరింతగా తగ్గుతుందేమోనని ఆందోళనగా ఉంది. నాకున్న పది ఎకరాల పొలంలో ఇప్పటికే కొంత మిర్చి పంట సాగు చేశాను. మిగిలిన కొంత టమోటా పంట సాగు చేయాల్సి ఉంది. ఇప్పటికే విద్యుత్ సమస్య ఉండడంతో టమోటా సాగు చేయాలా, వద్దా అనే మీమాంసలో ఉన్నాను. ప్రభుత్వం 9 గంటలు నిరంతరం విద్యుత్ ఇవ్వాలి.

అరకొరగా ఉన్న నీటినీ వాడుకోలేకున్నాం

- పీరయ్య, దిన్నెపాడు, లక్కిరెడ్డిపల్లె



లక్కిరెడ్డిపల్లె మండలంలో రబీ సీజన్‌లో బోర్ల కింద వేరుశనగ, ఇతర పంటలు సాగు చేశాను. ప్రభుత్వం 9 గంటలు ఉచిత విద్యుత్‌ను అందిస్తామని చెప్పి కనీసం రోజుకు ఐదు గంటలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. బోర్లలో అరకొర ఉన్న నీటిని కూడా పంటలకు వాడుకోలేకున్నాం. సాగులో ఉన్న పంటలు ఎండిపోతున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాము. విద్యుత్ క్లస్టర్ ప్రకారం పంటల సాగుకు కనీసం ఏడు గంటలైనా ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

ప్రభుత్వ విధానం రైతులకు శాపం

- శివప్పనాయుడు, ఎగువగొట్టివీడు, గాలివీడు



ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం ప్రకారం రోజుకు ఐదు గంటలు కూడా సక్రమంగా కరెంటు సరఫరా కావడం లేదు. 9 గంటలు నిరంతరాయంగా నాణ్యమైన కరెంటును అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్తోంది. 9 గంటలు కాదు కదా, కనీసం ఐదు గంటలు కూడా ఇవ్వడం లేదు. నాకు 1250 మామిడి చెట్లు ఉన్నాయి. మూడు బోర్లు వేశాను. అప్రకటిత కరెంటు కోత వల్ల నీళ్లు పారగట్టుకోలేకున్నాం. పగటి పూట వచ్చే కరెంటు సరఫరాలో పదే పదే అంతరాయాలు ఏర్పడుతున్నాయి.

తమలపాకు తోట దెబ్బతింటోంది

- ప్రసాద్‌రెడ్డి, ఓబులవారిపల్లె



మేము తమలపాకు, అరటి పంటలు సాగు చేశాము. కరెంటు సక్రమంగా రావడం లేదు. ఉన్నట్టుండి కరెంటుపోతోంది. సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే మెయిన్ లైన్ ప్రాబ్లమ్ ఉంది. ఎప్పుడు వస్తుందో తెలియదంటున్నారు. మరికొన్ని సార్లు లైన్ ట్రిప్ అవుతుందంటున్నారు. సక్రమంగా నీరు అందకపోతే తమలపాకు తోటలు దెబ్బతింటాయి. ఇప్పటికే ధరలు లేక.. ఇబ్బందులు పడుతున్నాం.. సక్రమంగా నీరు ఇవ్వకపోతే దిగుబడి రాకుండా ఎండిపోతాయి. కరెంటు సక్రమంగా ఇచ్చి రైతులను ఆదుకోండి.

రూ.లక్షలు పెట్టి టమోటా సాగు చేశా

- ప్రశాంత్‌కుమార్, కేశాపురం, చిన్నమండెం



లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి నాలుగు ఎకరాల్లో టమోటా సాగు చేశాను. పగటిపూట రెండు, మూడు గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నారు. రాత్రి సమయాలలో మిగిలిన కరెంటు ఇస్తున్నారు. 9 గంటల కరెంటు అని.. పూర్తి స్థాయిలో పంటలు పెట్టాం. ఇప్పుడేమో.. ఏడు గంటలు, ఒక్కోరోజు కేవలం నాలుగైదు గంటలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాము. బోనమల సబ్‌స్టేషన్ కేశాపురం ఫీడర్‌లో సప్లై ఉన్న సమయంలో ఏవీ స్విచ్ ఆఫ్ చేసి పనులు చేస్తూ ఉండడంతో. కరెంటుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అంతరాయం లేకుండా కరెంటు ఇవ్వాలి.

అనధికార కరెంటు కోతతో కష్టాలు

- నరసింహులు, రైతు, మదనపల్లె



పోతబోలు గ్రామంలో మూడు ఎకరాలకు పైన టమోటా సాగు చేశాను. కరెంటు సమస్యతో రాత్రింబవళ్లు పొలాల వద్ద కాపు కాయాల్సిన పరిస్థితి వస్తోంది. కరెంటు ఏ సమయంలో వస్తుందో? తెలియక వేచి చూస్తున్నాం. ఈ ప్రభుత్వంలో కూలీల రేట్లు, విత్తనాల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో పంట పెట్టడం రైతుకు భారంగా మారుతోంది. నేను మూడు ఎకరాల్లో టమోటా సాగు చేయడానికి దాదాపుగా 9 లక్షల రూపాయలు ఖర్చు అయింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతుల కోసం ఏకధాటిగా 9 గంటలు కరెంటు సరఫరా చేయాలి.

ప్రశ్నాపత్రాల లీకేజీని అరికట్టడానికి పటిష్టమైన క్యూఆర్ కోడ్ సాంకేతికత

- కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: పదవ తరగతి ప్రశ్నా పత్రాలు లీకేజీని అరికట్టడం కోసం పటిష్టమైన క్యూఆర్ సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వం వివిధ చర్యల ద్వారా అత్యంత పటిష్టవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాలు సీల్డ్ కవర్లను తెరిచేటప్పుడు సీసీ టీవీ కెమెరాల ద్వారా పర్యవేక్షించడం, పరీక్షా కేంద్రాల్లో సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం, ఫ్లయింగ్ స్క్వాడ్లు వంటి అనేక చర్యల ద్వారా పరీక్షలను పటిష్టవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలకు ముద్రించే ప్రశ్నా పత్రాలతో క్యూఆర్ కోడ్ ముద్రించబడుతుందని, రాష్ట్రంలో పరీక్ష రాయబోయే ప్రతి విద్యార్థికి ఇవ్వబోయే ప్రశ్నాపత్రంలో క్యూఆర్ కోడ్ వేర్వేరుగా ఉంటుందని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగి ప్రశ్నాపత్రం లీకేజీ అయితే ఆ ప్రశ్నాపత్రం ఏ విద్యార్థి దగ్గర నుంచి లీక్ అయిందో క్యూఆర్ కోడ్ ద్వారా తెలుసుకోవచ్చునని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ఎవ్వరూ ప్రశ్నాపత్రం లీకేజీకి పాల్పడవద్దని సూచించారు.

ప్రజల రుణం తీర్చుకుంటాము



వాల్మీకిపురంలో ప్రజలకు అభివాదం చేస్తున్న నారా భువనేశ్వరి

- నారా భువనేశ్వరి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 22: అన్ని కాలాల్లోనూ తమ కుటుంబానికి, టీడీపీకి అండగా ఉన్న ప్రజల రుణం తీర్చుకుంటామని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఈకొద్ది రోజులు కష్టపడి పనిచేయాలని కోరారు. ఆ తరువాత అందరికీ అంతా మంచే జరుగుతుందని అభిప్రాయపడ్డారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం ఆమె మదనపల్లె నుంచి పుంగనూరు వెళుతూ మార్గమధ్యంలో వాల్మీకిపురం సెంటర్‌లో ఆగారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అక్కడ పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని భువనేశ్వరిని గజమాలతో సత్కరించి నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ అవినీతి వైసీపీ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలను, వృద్ధులను ఆమె ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిరగబడేదాకా తెచ్చుకోవద్దు...!

- దాడుల గురించి స్పందించే తీరిక లేదా..?
- నియంత్రించకపోతే తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తాం
- సీఎం జగన్‌కు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ హెచ్చరిక
- 'చలో అనంతపురం' ధర్నాలో కదంతొక్కిన జర్నలిస్టులు

అనంతపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తిరగబడేదాకా తెచ్చుకోవద్దని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని, దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని జర్నలిస్టు నాయకులు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి, ఇతర ప్రాంతాల్లో జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై వైసీపీ దాడులను ఖండిస్తూ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర శాఖ గురువారం 'చలో అనంతపురం' కార్యక్రమాన్ని చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి జగన్‌కు స్పందించే తీరిక కూడా లేదా అని ఆ సంఘం నాయకులు ప్రశ్నించారు. సాక్షాత్తు సీఎం జగన్ సిద్ధం సభలోనే ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణారహితంగా దాడి చేసి చంపేందుకు ప్రయత్నించిన సంఘటనను ప్రజాస్వామికవాదులందరూ ఖండించారని అన్నారు. అయినా ముఖ్యమంత్రిగాని, డీజీపీగాని ఇప్పటి దాకా నోరుమెదపకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికైనా జర్నలిస్టులు, పత్రికా కార్యాలయాలపై దాడులను నియంత్రించకపోతే 'చలో అనంతపురం'తో ఆగమని, తాడేపల్లి ప్యాలెస్‌ను ముట్టడిస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు హెచ్చరించారు. అనంతపురం నగరంలోని సంగమేశ్వర సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు జర్నలిస్టు సంఘాల నాయకులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు ఉమ్మడి కడప, కర్నూలు జిల్లాల నుంచి వందలాది మంది జర్నలిస్టులు తరలివచ్చారు. టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, ఆయా పార్టీల అనుబంధ సంఘాలు, ఏపీ ఎన్జీవో, పెన్షనర్స్ అసోషియేషన్, స్వచ్ఛంద సేవా సంస్థలు, కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకుల జర్నలిస్టుల నిరసనకు సంఘీభావం తెలిపారు. ఏపీయూడబ్ల్యూజే కడప జిల్లా అధ్యక్షుడు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులు చేసేందుకే సిద్ధం సభలు చేపట్టారా అని ప్రశ్నించారు. దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి జర్నలిస్టులను చాలా గౌరవించేవారని, అలాంటి నేత కుమారుడై ఉండి జర్నలిస్టులపై దాడులు చేయిస్తావా అని జగన్‌ను నిలదీశారు. శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ మూకలను తక్షణమే అరెస్టు చేయాలని, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై స్పందించని డీజీపీకి ఆ సీటులో కూర్చునే అర్హత లేదన్నారు. అనంతరం ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు.



అనంతపురంలో జరిగిన ధర్నాలో అన్నమయ్య జిల్లా జర్నలిస్టులు

శ్రీనిధికి ఉత్తమ అగ్రి స్టార్టప్ అవార్డు

- మదనపల్లెలో వినూత్నంగా కుంకుమపువ్వు సాగు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22: మదనపల్లెకు చెందిన శ్రీనిధి గురువారం హైదరాబాదులో ఉత్తమ అగ్రిస్టార్టప్ అవార్డు అందుకున్నారు. మదనపల్లె వాతావరణంలో కుంకుమ పువ్వును పండించి విదేశాలకు ఎగుమతి చేయడంలో నైపుణ్యం ప్రదర్శించినందుకు ఈ అవార్డు దక్కింది. హైదరాబాదులో మేనేజ్ సంస్థ ఆధ్వర్యంలో ఏపీలో ఉత్తమ అగ్రి స్టార్టప్ అవార్డును మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ అడిషనల్ సెక్రటరీ ఫయాజ్ అహ్మద్, మేనేజ్ సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, మేనేజ్ డైరెక్టర్ (ఏబీఎం) డాక్టర్ శ్రీకాంత్, డైరెక్టర్ మేనేజ్ అగ్రికల్చర్ డాక్టర్ శ్రవణ్‌రాజు, మేనేజ్ డీడీ (నాలెడ్జ్ మేనేజ్‌మెంట్) డాక్టర్ శ్రీనివాసాచార్యులు చేతుల మీదుగా శ్రీనిధికి అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా మదనపల్లెకు చెందిన శ్రీనిధిని టీడీపీ మైనార్టీ నేత ఎస్ఏ మస్తాన్ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. అవార్డు పొందిన సందర్భంగా శ్రీనిధి మాట్లాడుతూ ఆధునిక పద్ధతులతో మదనపల్లె వాతావరణంలో కూడా కుంకుమ పువ్వును పండించేలా ప్రయోగం చేసి సక్సెస్ చేశానని, కొత్తరకం వంగడాలతో వినూత్నంగా ప్రయోగం చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. తనను గుర్తించి ఏపీలోనే ఉత్తమ అగ్రి స్టార్టప్ అవార్డు అందించి ప్రోత్సహించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



హైదరాబాదులో అవార్డు అందుకుంటున్న శ్రీనిధి

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈవో శివప్రకాశ్‌రెడ్డి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి

సంబేపల్లె, ఫిబ్రవరి 22: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి తెలియజేశారు. గురువారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాలల్లో నిర్వహించిన వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యమైన భావనలపై, పట్టికలపై పటాలపై వారికి తర్ఫీదు ఇవ్వడం ద్వారా వారిని కూడా ఉత్తీర్ణులను చేయవచ్చునన్నారు. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి కృషి, పట్టుదలతో బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు, ఎంఈవో రమాదేవి, శ్రీనివాసులు, సాయి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, సంబేపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అంకురార్పణతో విజయదుర్గాదేవి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అమ్మవారి ఫ్లెక్సీలతో ధగధగలాడుతున్న ఆలయ ముఖద్వారం

కడప(కల్చరల్), ఫిబ్రవరి 22: నగర బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సాయంత్రం 6 గంటలకు గణపతి పూజ, అంకురార్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదు రోజులపాటు జరుగనున్నట్లు వెల్లడించారు. వేదపండితులు రాయపద్ది సుబ్బరామశర్మ శిష్య బృందం, ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, యాగశాలలో ద్వార దేవతా ఆవాహన, మండపారాధనలు, ప్రధాన కళశస్థాపన, వాస్తు పూజాది కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. 23వ తేదీ శుక్రవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, చండీహోమం, సుమంగళిపూజ, కార్యక్రమాలు జరుగనున్నాయన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయం రంగురంగుల విద్యుత్ దీపాల కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది.

బీసీలను ప్రోత్సహించే ఏకైక పార్టీ టీడీపీ

● జయహో బీసీ సమావేశంలో బీటెక్ రవి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహించే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. గురువారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో జయహో బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ సమావేశాన్ని ప్రైవేట్ ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని అధిష్టానం సూచించిందన్నారు. ఎందుకంటే బీసీలందరూ వస్తారని, తటస్థులు హాజరవుతారనే కారణంగా నిర్ణయం తీసుకుందన్నారు. అయితే పులివెందులలో ఫంక్షన్ హాల్స్‌లో సమావేశం ఏర్పాటు చేసేందుకు అవకాశం లేదన్నారు. మీ మీటింగ్‌కు బాడుగకు ఇస్తే మమ్మల్ని ఇబ్బంది పెడతారు దయచేసి ఇక్కడ పెట్టుకోవద్దని యజమానులు అంటున్నారన్నారు. అందుకే పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకే సమావేశానికి మన పార్టీకి చెందిన వారే వచ్చారన్నారు.

తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ అనే విధంగా పెద్దపీట వేస్తోందని తెలిపారు. మొదటి నుంచి ఎర్రన్నాయుడు, అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడు ఇలా అనేక మంది బీసీ నాయకులు టీడీపీలో పెద్ద పదవులు అలంకరించారన్నారు. మన తెలుగుదేశం పార్టీలో ఉన్న బీసీలకు ప్రాధాన్యత ఇస్తూ ఎలా ప్రోత్సహించిందో అందరూ ఆలోచించాలన్నారు. వైసీపీ ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్ల ద్వారా ఒక్క బీసీకి అయినా లక్ష రూపాయల రుణం ఇచ్చిందా అని ప్రశ్నించారు. ఒకవేళ ఇచ్చి ఉంటే బీసీల గురించి మాట్లాడమన్నారు. 56 కార్పొరేషన్లకు 56 మందిని నియమించినా వారికి ఆఫీసు లేదు టేబుల్ లేదన్నారు. మరో విషయం ఏంటంటే వడ్డెరకు సంబంధించి శ్రీను అని సీఎం జగన్‌కు బాగా గుర్తుండే వ్యక్తి ఉన్నారన్నారు. అతనికి ఓ దానిలో డైరెక్టర్ పోస్టు ఇచ్చారన్నారు. అతను ఇప్పటికీ ప్రమాణ స్వీకారం కూడా చేయలేదన్నారు. అయితే నీకు టైం అయిపోయిందని ఇంటికి పంపించారన్నారు.

56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని పేపర్‌లో చెప్పుకొనేదానికి మాత్రమే అని విమర్శించారు. మన ప్రభుత్వంలో గతంలో బీసీలకు రెండు లక్షల రూపాయలు రుణం ఇచ్చి అందులో లక్ష రూపాయల సబ్సిడీని అందించామన్నారు. తద్వారా ఉపాధిని ఏర్పాటు చేసుకుని కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలని మన ప్రభుత్వం చేసిందని తెలిపారు. పలువురు మాట్లాడుతూ వడ్డెరులకు ప్రమాద బీమాతో పాటు తక్షణ ఆర్థికసాయం అందించేలా పథకం ప్రవేశపెట్టాలని కోరారు. ఇంకా పలువురు తమ తమ అభిప్రాయాలను తెలియజేయగా అన్ని అంశాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని బీటెక్ రవి తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీసీ వర్గ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ గ్యారేజీలో.. ఆ సార్‌దే హవా

● బస్సుల కండిషన్ గాలికొదిలేసి..
సిబ్బందిపై కస్సు బుస్సులు
● చోద్యం చూస్తున్న అధికారులు



కడప ఆర్టీసీ గ్యారేజీ

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 22: అది ఆర్టీసీ కడప డిపో గ్యారేజీ. అక్కడ బస్సుల కండిషన్ బాగాలేని వాటిని సరిచేసి తిరిగి రోడ్డుపై ప్రయాణికుల సేవలో సవ్యంగా నడిచేలా మరమ్మతులు జరుగుతుంటాయి. సుమారు వంద మందికి పైగా మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు రాత్రీపగలూ తేడా లేకుండా బస్సుల కండిషన్ మెరుగుపరచేందుకు షిఫ్ట్‌ల వారిగా పనిచేస్తుంటారు. వారంతా సవ్యంగా విధులు నిర్వహించేలా మెకానిక్‌లను అజమాయిషీ చేసేందుకు వీలుగా గ్యారేజీలో ఓ సార్ (డిప్యూటీ సూపరింటెంటెంట్ మెకానిక్) ఉంటారు. ఈయన అంతా తానే అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు. ఆ సార్ చెప్పిందే వేదం, చేసిందే శాసనం. అక్కడి కిందిస్థాయి మెకానిక్‌లను, అలాగే సూపర్‌వైజర్లను కూడా లెక్కలేని తనంతో దుర్భాషలాడడం... తూలనాడడం నిత్యం పరిపాటిగా మారిందని పలువురు మెకానిక్‌లు లోలోన మధనపడుతున్నట్లు సమాచారం. పైపెచ్చు అంతా ఆ సార్ తనకే తెలుసన్నట్లుగా రుబాబు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అంతలా ఆ సార్ హవా అక్కడ సాగడానికి కడప డిపో అధికారి ఆశీర్వాదాలున్నట్లు డిపోలో పలువురు చర్చించుకుంటున్నారు.

జిల్లా కేంద్రమైన కడప డిపోలో సుమారు 100 పైచిలుకు వివిధ రకాల (పల్లెవెలుగు, డీలక్స్, అల్ట్రాడీలక్స్, సూపర్‌లగ్జరీ, ఇంద్ర, అమరావతి) బస్సులున్నాయి. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేలా బస్సుల కండిషన్‌ను మరింతగా మెరుగుపరిచే పనులను గ్యారేజీలో చేస్తుంటారు. బస్సుల కండిషన్, పరిశుభ్రత పట్ల శ్రద్ధచూపాల్సిన బాధ్యతను ఆ సార్ గాలికొదిలేసి మెకానిక్‌ల పట్ల కస్సు బుస్సుల పర్వానికే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారనే విమర్శలున్నాయి. ఒక్కోసారి ప్రయాణికులను తీసుకెళ్లే క్రమంలో బస్సులు మార్గమధ్యంలో చెడిపోయి నిలిచిపోయిన సందర్భాలున్నాయి. అలా జరగకుండా ఆయా బస్సుల కండిషన్‌ను ముందస్తుగా చెక్ చేయాల్సిన బాధ్యత గ్యారేజీ మెకానిక్‌లపై ఉందనే నెపంతో ఆ సార్ మెకానిక్‌ల పరుష పదజాలంతో దూషిస్తున్నట్లు సమాచారం.

ఇదిలావుండగా కడప డిపోతో పాటుగా గ్యారేజీలో వివిధ యూనియన్లకు చెందిన ఉద్యోగులు, మెకానిక్‌లు సేవలందిస్తున్న సంగతి తెలిసిందే. వారిలో ఒక యూనియన్ మెకానిక్‌లకు వత్తాసు పలుకుతూ మిగతా యూనియన్ మెకానిక్‌ల పట్ల చిరాకుతో వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో గ్యారేజీ మెకానిక్‌లు ఆ సార్ వ్యవహారంతో ఇబ్బంది పడుతున్నారని సమాచారం. ఏది ఏమైనా గ్యారేజీలో ఆ సార్ వ్యవహరిస్తున్న తీరుపట్ల పైస్థాయి అధికారులు దృష్టి సారించి తమకు ఇబ్బందులు కలగకుండా చూడాలని గ్యారేజీ మెకానిక్‌లు కోరుతున్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి

● డీపీవో ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీపీవో ప్రభాకర్‌రెడ్డి

కడప (రూరల్) ఫిబ్రవరి 22 : పంచాయతీ శాఖ ద్వారా సాధించాల్సిన ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ప్రతి ఒక అధికారి అంకిత భావంతో బాధ్యతాయుతంగా విధులను చేపట్టాలని పంచాయతీశాఖ జిల్లా అధికారి (డీపీవో) ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణంలోని డీపీవో కార్యాలయంలో గురువారం ఆయా మండల ఈవోపీఆర్‌డీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 15వ ఆర్థిక ఫైనాన్స్ నిధులకు సంబంధించి ప్రగతి నివేదికను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. పంచాయతీశాఖ ద్వారా చేపట్టాల్సిన పన్నులను సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన ప్రగతి నివేదికల మేరకే అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అభివృద్ధి ప్రణాళికను మండల పరిషత్తుశాఖలు ఈనెల 29వ తేదీ లోపు, జిల్లా స్థాయి అభివృద్ధి ప్రణాళికను మార్చి 31లోపు ఈ-గ్రామస్వరాజ్ పోర్టల్‌లో తప్పక నమోదుచేయాలన్నారు. రాజ్యాంగంలోని 243 జి ఆర్టికల్ ప్రకారం పంచాయతీలను స్థానిక ప్రభుత్వాలుగా గుర్తించి వాటి ద్వారా ప్రజల ఆర్థికాభివృద్ధి, సామాజిక న్యాయం సాధించడానికి తగిన ప్రణాళికలను తయారు చేయాలని ప్రభుత్వాలు ఆదేశించాయన్నారు. వీటిలో పేదరికంలేని మెరుగైన జీవనోపాధుల గ్రామం, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలల స్నేహపూర్వక గ్రామం, నీటి సౌకర్యం కలిగిన గ్రామం, పారిశుధ్యం, పచ్చదనం కలిగిన గ్రామం, స్వయం సమృద్ధితో కూడిన మౌళిక సదుపాయాలు కలిగిన గ్రామం, సామాజిక న్యాయం, భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలనతో కూడిన గ్రామం, మహిళా స్నేహపూర్వక గ్రామం తదితర అంశాలున్నాయన్నారు.

వీటికి సంబంధించిన వివిధ స్థాయిలలో ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే ప్రణాళికలను తయారుచేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో ఖాదర్‌బాషా, కడప డీఎల్‌పీవో ఎస్.మస్తాన్ వలి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 22: మండలంలోని ఉరుటూరు గ్రామ సమీపంలో ఉన్న సత్రం వద్ద గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో వేంపల్లెకు చెందిన షేక్ సాజిబాబా (24) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వేంపల్లె నుంచి నాలుగుచక్రాల ఆటోలో ఎర్రగుంట్లకు వెళ్తుండగా సత్రం వద్దకు చేరుకున్న సమయంలో సత్రాన్ని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఇతను వీరపునాయునిపల్లెలో చికెన్ సెంటర్ నిర్వహిస్తుండేవాడు. పనినిమిత్తం ఆటోలో ఎర్రగుంట్లకు వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ఇతనికి భార్య ఉన్నారు. సాజిబాబా మృతితో ఆయన కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దళితుడిపై వైసీపీ నాయకుల దాడి, తీవ్రగాయాలు



గాయపడిన జయన్న

అట్లూరు, ఫిబ్రవరి 22 : అట్లూరు మండలం మన్నెంవారిపల్లె వైసీపీ నాయకులు మన్నెం తిరుపతిరెడ్డి, మన్నెం రామనాథరెడ్డి, సుభద్రమ్మ, దిన్నెమీదపల్లె దళిత కాలనీకి చెందిన జయన్నపై మంగళవారం రాత్రి కర్రలతో దాడి చేయగా తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోహన్ బాబు తెలిపారు. మంగళవారం రాత్రి తన పొలం వద్ద ఉన్న పైపులు కనిపించకపోవడంతో ఎవరు దొంగిలించారోనని జయన్న తిడుతున్నారు. అక్కడే పక్క పొలంలో ఉన్న తిరుపతిరెడ్డి, రామనాథరెడ్డి, సుభద్రమ్మ ఎవర్నిరా నువ్వు తిట్టేది అంటూ తనపై దాడి చేసి చెప్పులతో కొట్టి గాయపరచినట్లు జయన్న పేర్కొన్నారు. పక్కనే ఉన్న కాలనీవాసులు, బంధువులు అక్కడకి చేరుకుని హుటాహుటిన 108 ద్వారా బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ బద్వేలు వైద్యాధికారులు మెరుగైన చికిత్స కోసం బుధవారం కడప రిమ్స్‌కు తరలించినట్లు జయన్న బంధువులు తెలిపారు.

పద్మావతి విశ్వవిద్యాలయం
తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ చైర్మన్‌గా ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డి



కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 22 : తిరుపతి శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం తెలుగుశాఖ బోర్డ్ ఆఫ్ చైర్మన్‌గా వైవీయు తెలుగుశాఖ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తుండిన కొలకలూరి మధు, జ్యోతి, ద్రవిడ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ప్రొఫెసర్ ఈశ్వర్‌రెడ్డిని పద్మావతి మహిళా యూనివర్శిటీ తెలుగుశాఖ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులుగా నియమించారు. ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల తెలుగు పాఠ్య పుస్తక రచయితగా పది సంవత్సరాల పాటు సేవలందించారు.

వైసీపీ నాయకులు వేధిస్తున్నారంటూ
పోలీసులకు టీడీపీ ఫిర్యాదు

వేంపల్లె, ఫిబ్రవరి 22: వేంపల్లె ఎస్సీకాలనీలో స్థలం విషయంలో వివాదం తలెత్తింది. టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంలో పలువురు టీడీపీ వర్గానికి చెందిన పలువురిని పోలీసులు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. పులివెందుల డీఎస్పీ వద్దకు పంపించి జాగ్రత్తగా వివాదాలకు ఆస్కారం లేకుండా పరిష్కరించుకోవాలని కౌన్సిలింగ్ ఇప్పించారు. ఈ వ్యవహారంలో వైసీపీ నాయకులు వేధింపులకు గురిచేస్తున్నారని టీడీపీకి చెందిన శేషగిరి సోదరి ఇంద్రాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధితులు తెలిపారు. ఈ విషయాలను సీఐ చాంద్‌బాష దృష్టికి తీసుకెళ్లగా స్థలం విషయం తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని అధికారులే నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ వ్యవహారంలో ఎస్సీలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించడం మంచిది కాదని ఇరుపార్టీల నాయకులకు సూచించారు.

స్ఫూర్తిదాయకం.. ఉయ్యాలవాడ త్యాగం

వర్ధంతి వేడుకలో పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 22: ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం కావాలని పంచాయితీరాజ్ పర్యవేక్షక ఇంజనీరు జీవీ శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 177వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించగా, ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసులురెడ్డి తొలుత పాత్రికేయుడు ఫణి రచించిన రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉయ్యాలవాడ సమీప గుళ్ళదుర్తి తన స్వగ్రామమన్నారు. రాయలసీమలో బ్రిటీషర్లకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు జరిపి ఉరికంబాన్ని ముద్దాడిన స్వాతంత్ర సమరయోధుడు నరసింహారెడ్డి అని కొనియాడారు. త్యాగం, దాతృత్వాలకు ప్రతిరూపాలైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, బుడ్డా వెంగళరెడ్డి ఒకే గ్రామానికి చెందిన వారు కావడం విశేషమన్నారు. భావితరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ప్రొద్దుటూరు పట్టణంలో వీరిరువురి కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రాయలసీమ కార్మిక, కర్షక సమితి అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు దారి తీసిన కీలక శ్రీబాగ్ ఒప్పందాన్ని చర్చకు రానీయకుండా తుడిచి వేయడానికి కొన్ని ప్రాంతాల నాయకులు, మీడియా ప్రయత్నాలు చేశాయన్నారు. అదే కోవలో ఏదో ఒక ముద్రవేసి నరసింహారెడ్డి చరిత్రను తుడిచి వేసేందుకు యత్నించడం విచారకరమన్నారు. రాయలసీమ చరిత్రను తుడిచి వేసే కుట్రలను ఎదుర్కోవాల్సిన అవసరముందన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఇంటాక్ కన్వీనర్ లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ సిపాయి తిరుగుబాటు పదేళ్ల ముందే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా గొప్ప పోరాటం నిర్వహించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశానికి వేగుచుక్కలా నిలిచారని కొనియాడారు. ఆయన చేసిన పోరాటం ఆ తర్వాత వచ్చిన ఉద్యమాలకు ఎంతో ప్రేరణ కల్పించిందన్నారు.

విద్యార్థులకు బహుమతులు

నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలలో గెలుపొందిన నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులైన ఎస్.ఆయేషాకు ప్రథమ బహుమతి లభించగా ద్వితీయ బహుమతిని ఎస్. ఆక్సా, తృతీయ బహుమతిని ఎస్. రషీద, టి. ఆషిన్‌లకు లభించాయి. ఈ కార్యక్రమంలో వైవీయూ పాలకమండలి సభ్యులు మూల మల్లికార్జునరెడ్డి, పద్మప్రియ చంద్రారెడ్డి, రాష్ట్ర అధికార భాష సంఘం సభ్యుడు తవ్వా వెంకటయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ నాయకులు జనార్దన్‌రాజు, ఏపీ రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆర్పీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, కె.లింగమూర్తి, ఏపీ పాలెగాళ్ల వారసుల సంక్షేమసంఘం నాయకులు బలరామయ్య, చంద్రప్పనాయుడు, మంగమ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



CEEDED SITAARE FILMS
94404 19231, 99085 49498

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం



మాట్లాడుతున్న సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి

పులివెందుల, ఫిబ్రవరి 22: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేపీ ప్రజాపోరు జిల్లా కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి విమర్శించారు. గురువారం బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం పులివెందుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వానికి మద్దతుగా, వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ప్రజాపోరు కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు. మోదీ సుపరిపాలనతో దేశం అభివృద్ధిపథంలో పరుగులు తీస్తోందని, ప్రపంచమంతా మోదీ నాయకత్వాన్ని కీర్తిస్తుందన్నారు. భవిష్యత్తులో భారత్ ఆర్థికంగా మూడోస్థానంలోకి చేరి ప్రపంచపటంలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించబోతోందని తెలిపారు. అలాగే 500 ఏళ్ల నాటి అయోధ్య రామాలయ కలను మోదీ సాకారం చేయడం జరిగిందన్నారు. రక్షణ రంగంలో భారతదేశం అగ్రగామిగా నిలవడంలో మోదీ కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ తేరా మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మ వర్గీయులు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న దొడ్డపనేని సీఎస్ నాయుడు

రాజంపేట, ఫిబ్రవరి 22 : కమ్మ వర్గీయులంతా ఐక్యంగా ఉండాలని కడప జిల్లా కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొడ్డపనేని సీఎస్ నాయుడు కోరారు. గురువారం పట్టణంలోని దిగువబసినాయుడుపల్లెలో కమ్మ సంఘ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే కొత్త ప్రభుత్వంలో కమ్మ వర్గీయుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో తానా మాజీ ప్రెసిడెంట్ వేమన సతీష్, బెజవాడ వెంకట్రావు, రాందాసు చౌదరి, తేజశ్విని, కుసుమకుమారి, అన్నమయ్య జిల్లా కమ్మ సంఘం ప్రెసిడెంట్ శివనారాయణ చౌదరి, కిశోర్‌చౌదరి, లక్ష్మీనారాయణ, మల్లి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నేతలు




వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో చంద్రబాబునాయుడు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 22 :హైదరాబాదులో గురువారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు సమక్షంలో టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి చంద్రబాబునాయుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు అఫ్జల్‌ఖాన్ సోదరుడు అఫ్సర్‌ఖన్, మాజీ కార్పొరేటరు రాజగోపాల్‌రెడ్డి, ఎండీహెచ్ నవీద్ సోదరుడు మహమూద్, ఫైరోజ్, లయన్ మన్సూర్‌ఖాన్, చెన్నంశెట్టి మురళి, జావీదు, జమాల్, షఫి, షబ్బీర్. తౌసిఫ్, జనవికాస్ తాహిర్, కత్తి రవి పాల్గొన్నారు.

మాతృ మరణాలను నియంత్రించాలి: డీఎంహెచ్ఓ



కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 22: మాతృ మరణాలను నియంత్రించాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు పీహెచ్‌సీ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం డీఎంఅండ్‌హెచ్ఓ తన చాంబరులో మాతృమరణాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ గర్భవతులకు ప్రాథమిక స్థాయిలోనే సేవలు అందాలన్నారు. రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్ లక్ష్మీసుశీల, డాక్టర్ సునీల్, డాక్టర్ యాదవేంద్రరెడ్డి, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ శాంతికళ తదితరులు పాల్గొన్నారు.



10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్
చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, P.G., B.Tech., MBA, M.Tech. పాసయ్యేచాన్స్ కలదు. నగేష్ అకాడమి, కడప. సెల్ : 7569470023
Ajc-185013

FEMALE TELECALLERS
Qua. : Inter, B.Tech., Degree (or) Any P.G. Location - Kadapa, Salary - 10000 to 15000/-, Exp. / Fresher, Cell : 86394 84896, 75502 54545
AJC-185018

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647
AJA- 176964

ఉద్యోగ ప్రకటన
అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ప్రముఖ విద్యాసంస్థ కొరకు మార్కెటింగ్ చేయుటకు అర్హత కలిగిన అభ్యర్థులు కావలెను వివరములకు సంప్ర: సెల్: 9392936712.
AJA-150299

UTI MUTUAL FUND
ప్రతినెల రూ. 12,000లు 6పథకాలు. 180 నెలలు ఆ తరువాత పత్రము నందు చూస్తారు. రూ. 78,00,000 అంతకన్న ఎక్కువ Tax Saving కొరకు ప్రతి సంవత్సరము రూ. 1,50,000లు పెట్టండి 6 సంవత్సరములు 7వ సం॥ నుండి ప్రతి సంవత్సరము రూ. 2,50,000లు తీసుకొని చిన్నారుల ఉన్నత విద్యకు ఉపయోగించండి. పాన్, ఆధార్, ఫోటో, చెక్, నామిని Proofతో సంప్రదించండి. ఈరోజే A.V.S. Chandra Reddy, MSc, MEd, AMFi, MFD, UTIMF, Kadapa- 98660 99827
Ajc-185233

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 24న మినీ జాబ్‌మేళా

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24న రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అన్నమయ్య జిల్లా అధికారి బీ. హరికృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మినీ జాబ్‌మేళాలో ఆటోలివ్ ఇన్వెటర్, ఇండి గ్రిడ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. డిగ్రీ, డిప్లొమా పాసైన 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు హాజరు కావచ్చునని తెలిపారు.ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.18 వేల నుండి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని తెలియజేశారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. కావున ఈ అవకాశాన్ని అన్నమయ్య జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ అన్నమయ్య జిఆల్ల అధికారి హరికృష్ణ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్‌లు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9550104260, 8897776368 నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

బారికేడ్‌ను ఢీకొన్న మినీ లారీ

నందలూరు, ఫిబ్రవరి 22 : కడప-చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు వ్యవసాయ తనిఖీ కేంద్రం వద్ద ఎర్రగడ్డ లోడుతో వెళుతున్న మినీ లారీ రాంగ్ రూట్‌లో వెళ్లి బారికేడ్‌ను ఢీకొంది. తాడిపత్రి నుండి ఎర్రగడ్డ లోడుతో చెన్నై వెళుతున్న లారీ చెక్‌పోస్టును తప్పించుకునే సమయంలో ప్రమాదానికి లోనైంది. ఆ సమయంలో వాహనాలు, ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న యార్డ్ అసిస్టెంట్ నాగరాజు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్ఐ రాముడు, సిబ్బంది దర్బార్‌బాషా సంఘటనా స్థలికి చేరుకొని బారికేడ్‌ను తొలగించారు. వాహనాన్ని , డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సంబేపల్లె, ఫిబ్రవరి 22: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని నారాయణరెడ్డిపల్లె సచివాలయం సమీపంలో గురువారం ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నారాయణరెడ్డిపల్లె నారాయణ రెడ్డి కస్పాకు చెందిన శ్రీనివాసులు తన ద్విచక్ర వాహనంలో పొలానికి వెళుతుండగా రాయచోటి నుంచి పీలేరు వైపు వెళ్తున్న బస్సు ఢీకొంది గాయపడ్డ వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి కడప రిమ్స్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 22: మండలంలోని కె.బుడుగుంటపల్లెలో కోదండరామస్వామి సన్నిధిలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహకులు అదునుకోట నరసింహస్వామి, మెక్కంటి వెంకటరమణ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తమ వెంట పూజా సామగ్రి తీసుకుని రావాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

మండిపల్లిని కలిసిన దిగువ అబ్బవరం యువకులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి22: మండలంలోని దిగువ అబ్బవరం గ్రామానికి చెందిన నాగార్జుననాయుడు ఆధ్వర్యంలో పలువురు యువకులు గురువారం రాయచోటి నియోజకవర్గ టీడీపీ యువనాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఆయన ఇంట్లో కలిశారు. శాలువాలతో, పూలమాలతో ఘనంగా సత్కరించి తమ సంఘీభావం తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాయచోటి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడేందుకు కలిసి కట్టుగా కృషి చేస్తామన్నారు.

డాక్యుమెంట్ పోయినది

కాండూరు జ్యోతి W/o కాండూరు చంద్రశేఖర్ రాజు, డి.నెం. 8/106ఎ, రామ్‌నగర్, రైల్వేకోడూరు, అన్నమయ్య జిల్లాకి చెందిన వీరి ఒరిజినల్ విక్రయ దస్తావేజు తేది: 17-01-2004, డాక్యుమెంట్ నెం. 63/2004 ఇంటి నుండి జిరాక్స్‌కోసం వెళుతుండగా రైల్వేకోడూరులో పోయినది. దొరికిన వారు క్రింది వారికి తెలుపుగలరు.

సెల్: 98404 70499

గమనిక

భారతీయ స్టేట్ బ్యాంక్, వ్యవసాయ వాణిజ్య శాఖ బ్రాంచ్, లక్కిరెడ్డిపల్లి, అన్నమయ్య జిల్లా

లక్కిరెడ్డిపల్లిలోని రామాపురం రోడ్డులో ఉన్న భారతీయ స్టేట్ బ్యాంక్‌ను రాయచోటి రోడ్డు మిస్సా చర్చి వద్దగల నూతన భవనములోనికి ఏర్పాటుచేశారు. 26-02-24వ తేది సోమవారం నుండి సేవలు కొనసాగుతాయని ఖాతాదారులు ఇకపై తమ సేవలను అక్కడ వినియోగించుకోగలరని మనవి చేసుకుంటున్నాము.

ఇట్లు, చీఫ్ మేనేజర్, లక్కిరెడ్డిపల్లె బ్రాంచ్

యువత భవిష్యత్తుకు.. బాబు గ్యారంటీ

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 22: యువత భవిష్యత్తుకు బాబు గ్యారంటీ అని టీడీపీ నాయకురాలు దుద్యాల అనితా దీప్తి తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జ్ కస్తూరి విశ్వనాథ్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని రంగనాయకులపేట, జగడంపల్లి వార్డులో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో సూపర్ సిక్స్‌లో ప్రజలకు అందే సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ నాయకురాలు సయ్యద్ మెహతాజ్ బేగం, మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, వార్డు మెంబర్ మణి యాదవ్, జి. మణి, గోపి,శివ, మావిళ్ళ రామయ్య, ఈశ్వర్ యాదవ్, సుభాన్, నగరిపాటి సంతోష్ పాల్గొన్నారు.



కొండూరులో ప్రచారం నిర్వహిస్తున్న రేవతి



టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న అనితా దీప్తి

పెనగలూరు: టీడీపీ జాతీయ నాయకులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన సూపర్ సిక్స్ మేనిఫెస్టోను నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి తీసుకుని వెళ్ళవలసిన బాధ్యత కార్యకర్తపై ఉందని టీడీపీ నాయకురాలు నగిరిపాటి రేవతి తెలిపారు. గురువారం మండలంలోని నరసింహరాజపురం, కొండూరు పంచాయతీలోని సిరివరం, తిరణంపల్లెల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేనిఫెస్టోలో మహిళలకు యువతకు పెద్దపీట వేశారని తెలిపారు. టీడీపీ అధికారంలో రాగానే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. కార్యకర్తలు ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షుడు రాంప్రసాద్ నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి బాలకృష్ణ, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి మురళి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు తేనేపల్లి చిన్న, మాజీ తహశీల్దారు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై వైసీపీ పైశాచిక ఆనందం...

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 22: మీడియా ప్రతినిధులపై దాడులతో వైసీపీ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీడియాపై ఉక్కు పాదం మోపడమే కాకుండా దాడులు నిర్వహించడం మొదలుపెట్టారు. ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భావనలో ఉన్న జగన్ రెడ్డి మీడియా ప్రతినిధులపై దాడులు అతని రాక్షసత్వానికి నిదర్శనం అన్నారు. ప్రజలలో చులకన అయిపోయిన వైసీపీ ఇక కేవలం దౌర్జన్యాలు డబ్బు సంచులపై మాత్రమే ఆధారపడి ఎన్నికలకు సిద్ధం అవుతోందని, దీన్ని తిప్పి కొట్టడానికి తాము సంసిద్ధంగా ఉన్నామన్నారు. మీడియాపై దాడులు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఒక మీడియా ఉందని సంగతి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు సూర్య ప్రకాష్ నాయుడు, మల్లెం హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంతగాని

సరుకుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 22: చౌక దుకాణాలకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జయరాం హెచ్చరించారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని నిత్యావసర సరుకుల గోదామును ఆయన తనిఖీ చేశారు. సరుకుల నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. తూకాలు కచ్చితంగా ఉండాలన్నారు. డీలర్ల నుంచి సకాలంలో డీడీలు కట్టించి ప్రతి నెల ఒకటో తేదీలోపు నిత్యావసర సరుకులను అందించాలన్నారు. గోదాములలో ఎలాంటి అక్రమాలు జరిగినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో గోదాము ఇన్‌చార్జి మల్లికార్జున బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



సరుకులను పరిశీలిస్తున్న పౌర సరఫరాలశాఖ అధికారి రఘురాం

దళిత భూములు ఆక్రమించిన వారిపై చర్యలేవీ?.

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 22: మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 2367లో దళిత గిరిజనులకు చెందిన 10 ఎకరాల జెడ్‌హెచ్, డీసీ ప్రభుత్వ బంజరు భూములను ఆక్రమించిన వైసీపీ నాయకుడు మల్లు కృష్ణారెడ్డిపై రెవెన్యూ అధికారులు ఎందుకు కేసులు నమోదు చేయలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు.ఈ నెల 26లోగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు హజ్మాబీ, రేవూరి శంకరయ్య, ఏడికా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంటా నరహరి జన్మదిన వేడుకలు

రాజంపేట/సిద్దవటం, ఫిబ్రవరి 22 : నియోజకవర్గంలోని పలు మండల ప్రాంతాల్లో గురువారం టీడీపీ నేత గంటా నరహరి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిద్దవటం మండలం జంగాలపల్లె పంచాయతీ ఎస్సీ కాలనీలో 100 కుటుంబాలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి నాగమునిరెడ్డి, సర్పంచ్ పాలెం వెంకటమ్మ, రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, పాలడుగు అయ్యప్ప నాయుడు, సుబ్బారెడ్డి, కొండవీటి సింహం, పార్లమెంటరీ అధికార ప్రతినిధి జింక శివ, మహేష్ నాయుడు, జింక ఓబులేసు, మైనారిటీ నాయకులు కదిరుల్లా తదితరులు పాల్గొన్నారు. రాజంపేట పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద గంటా నరహరి యువసేన, టీడీపీ నాయకులు కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సునీల్‌శెట్టి, మద్దిపట్ల ప్రసాద్, బలరాం, గుగ్గిరి రాజాయాదవ్, కరీముల్లా తదితర నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి22: పట్టణంలోని లక్ష్మీపురంలో ఉన్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో గురువారం రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ నాయకులు రామా శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాలను నిర్మాణానికి కృషి చేసినమాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రూ.23,60లక్షల స్త్రీనిధి బకాయిలు

- జిల్లా శ్రీనిధి ఏజీఎం ఉదయ్ కుమార్

నందలూరు, ఫిబ్రవరి 22 : మండలంలో సుమారు 23,60,158 రూపాయల స్త్రీనిధి మొండి బకాయిలు పేరుకు పోయాయని అన్నమయ్య జిల్లా శ్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్ కుమార్ తెలిపారు. గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం వసుంధర ఆధ్వర్యంలో 26 గ్రామ సంఘాల ఆనిమేటర్లతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బకాయిలు పేరుకుపోవడం వల్ల ఈ ఆర్థిక సంవత్సరానికి మంజూరు కావాల్సిన 3.86 కోట్ల నిధులు మంజూరు ఆగిపోయిందన్నారు. కేవలం 9 గ్రామ సంఘాలలో బకాయిల కారణంగా మిగతా సంఘాలకు నష్టం వాటిల్లిందన్నారు. రుణాల వసూలుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి క్లస్టర్ మేనేజర్ హరీష్, సీసీలు, రామ్మోహన్, విజయ కళ, సుభద్రమ్మ, విజయలక్ష్మీ, అకౌంటెంట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏజీఎం ఉదయ్ కుమార్

ధర్నాకు తరలిన రాజంపేట జర్నలిస్టులు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 22 : విలేకర్లపై దాడికి నిరసనగా అనంతపురంలో జరుగుతున్న జర్నలిస్టుల ధర్నాలో రాజంపేట జర్నలిస్టులు పాల్గొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి ప్రత్యేక వాహనంలో అనంతపురం తరలివెళ్లారు. అక్కడ జరిగిన ధర్నాలో పాల్గొన్నారు.

26న కొత్తపురమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట

సుండుపల్లె, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని పెద్దబలిజపల్లె, గుట్టకాడపల్లి, మల్లక్కగారిపల్లె సమీపంలోని కొత్తపురమ్మ దేవాలయంలో ఈ నెల 26న ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్నట్లు డీలర్ వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు తెలిపారు. 26 ఉదయం 6 గంటలకు గణపతి పూజ, స్వస్తివచనం, కలశస్థాపన, నవగ్రహ పూజ, అమ్మవారికి అభిషేకాలు మధ్యాహ్నం 12 గంటల నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం అన్న సంతర్పణ ఉంటుందని తెలియజేశారు.

అంగన్వాడీలకు సమ్మె కాలపు వేతనాలు ఇవ్వాలి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 22: అంగన్వాడీలకు సమ్మె కాలపు వేతనం చెల్లిస్తామని గత నెల 22న రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించినా ఇంతవరకు దానిని అమలు చేయలేదని, వెంటనే సమ్మె కాలపు వేతనం ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి డీ. భాగ్యలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడు తూ 2 నెలల వేతనాలతో పాటు రెండు నెలల సెంటర్ అద్దెలు, ఒక నెల కూరగాయల బిల్లులు 2022 అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 16 నెలలుగా రావాల్సిన ఈవెంట్స్ బిల్లులు ఇంతవరకు ఇవ్వలేదన్నారు. సంబేపల్లె మండలంలోని దేవపట్ల, శెట్టిపల్లె సెక్టార్ల పరిధిలోని వర్కర్లకు 2022 ఆగస్టు వేతనం ఇవ్వలేదన్నారు. హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. నాడు- నేడు పనుల్లో అంగన్వాడీల మీద ఒత్తిడి తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సిద్దమ్మ, సెక్టార్ లీడర్లు డీ. విజయమ్మ, సుమలత, నసీబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ

జెండా ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 22: మండలంలోని తల్లెంవారిపల్లెలో బీజేపీ ఫ్లెక్సీలను చించడంతో పాటు జెండా స్తంభం విరగ్గొట్టడంపై బీజేపీ నాయకులు మండిపడ్డారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డికి చెందిన స్థలంలో జనవరి 12న బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ ఆవిష్కరించిన జెండా స్తంభాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అర్థరాత్రి సమయంలో ధ్వంసం చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనతల సురేష్ మాట్లాడుతూ సీఎం సలహాదారుడు ధనుంజయరెడ్డి గ్రామానికి వస్తున్న సందర్భంగా కొంత మంది వైసీపీ గూండాలు అత్యుత్సాహంతో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. బీజేపీ నాయకులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం, పోలీస్‌స్టేషన్ ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. 24గంటల్లో దుండగులను శిక్షించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. నియోజకవర్గ కన్వీనర్ చంగల్‌రాజు, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌వర్మ, ఓబులవారిపల్లె సీనియర్ నాయకులు తోట శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుబ్బారావు, బాలసుబ్రమణ్యం, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు



జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడి

రైల్వేకోడూరు(రూరల్) ఫిబ్రవరి 22: మామిడి రైతులు తగిన జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కే.గోపాల్ తెలిపారు. గురువారం ఉద్యాన కళాశాలలో రైతులకు ఇన్‌పుట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి ఎస్సీ సబ్‌ప్లాన్ ప్రాజెక్టులో ఎంపిక చేసిన 20 మంది రైతులకు జీవన ఎరువులు, సూక్ష్మ పోషకాలు, వర్మికంపోస్ట్, పచ్చిరొట్టె ఎరువులు ఇతర పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కే.యువరాజ్, కే.లలిత, వై.శిరీష, సదరున్నీషా, జయప్రద తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న కళాశాల ఉపాధ్యాయ బృందం

సైన్స్ టీచర్ లేక విద్యార్థులకు ఇబ్బందులు

చిన్నమండెం, ఫిబ్రవరి 22: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో రెండు నెలలుగా 6, 7, 8 తరగతులకు సైన్స్ టీచర్ లేక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. పరీక్ష టైం దగ్గర పడుతున్న సమయంలో వెంటనే సబ్జెక్ట్ టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ రమేశ్ మాట్లాడుతూ రెండు నెలల క్రితం సైన్స్ టీచర్ పదోన్నతి మీద వెళ్లడంతో, ఉన్న ఉపాధ్యాయులతోనే సబ్జెక్టు చెప్పించాలని ఉన్నతాధికారులు సూచించారన్నారు.

రైతులపై కేంద్ర ప్రభుత్వం దాడులు దుర్మార్గం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 22: హక్కులను అడిగితే అన్యాయంగా రైతులను కాల్చి చంపు తారా.. అని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి ప్రశ్నించారు. రైతులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గమైన ఆలోచనలు మానుకోవాలని కోరుతూ గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రాయచోటి తహసీల్దార్ జయన్న కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల డిమాండ్లను పరిష్కరించకపోతే అతి త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో కొట్టుకునేపోయే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, వెంకటేశ్, గోపాల్, నాగయ్య పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం నేతలు

జాతీయ స్థాయి క్రీడల్లో 'కస్తూర్బా' విద్యార్థినుల ప్రతిభ

రామాపురం, ఫిబ్రవరి 22: 2023-24 67 ఏపీ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో అన్నమయ్య జిల్లా రామాపురం మం డలం కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఆరుగురు జాతీయ స్థాయి , 18 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనపర్చారు. యోగ, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, సైక్లింగ్, 800 మీటర్స్ రన్నింగ్, బాస్కెట్ బాల్ తదితర పోటీల్లో వారు ప్రతిభను కనపర్చారు.

ఘనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 22 : మండలంలోని చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ దస్తగిరి తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు శ్రీనివాసులు, రమణ, వ్యాయా మ ఉపాధ్యాయురాలు శారద, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోకు సర్వం సిద్ధం

నందలూరు, ఫిబ్రవరి 22: పల్స్‌పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ తెలిపారు. గురువారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కల సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 4800 మంది ఐదేళ్లలోపు చిన్నారులుండగా, 48 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకట నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఆకస్మిక తనిఖీ

నందలూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని పాటూరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో శేఖర్ నాయక్ గురువారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈఆధార్ ప్రక్రియ నిర్వహిస్తున్న సోని శామ్యుల్‌ను ఎంపీడీవో అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ జానకి రామచంద్రన్, వీఆర్వో లక్ష్మయ్య, ఎంపీఈవో సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను ఓటర్లుగా నమోదు చేస్తే చర్యలు

చిట్వేలి, ఫిబ్రవరి22 : అనర్హులను ఓటర్లుగా నమోదు చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దారు జ్ఞానేశ్వరి హెచ్చరించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గుర్తు తెలియని కొందరు అనర్హుల ఫొటోలు, సర్టిఫికెట్లు తీసుకొని అధికారుల అనుమతి లేకుండా ఆన్‌లైన్‌లో ఓటర్లుగా నమోదు చేస్తున్నారన్నారు. అర్హులైన ఓటర్లు అందరూ తమ పేరు జాబితాల్లో ఉందోలేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు సుమని, ఆర్ఐ శేషంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

383 మంది రైతులకు రూ. 27 కోట్ల రుణాలు

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 22: మండలంలోని 383 మంది రైతులకు ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లకు రూ.27 కోట్ల వ్యవసాయ రుణాలు మంజూరు చేసినట్లు లక్కిరెడ్డిపల్లెలోని ఎస్‌బీఐ వ్యవసాయ వాణిజ్య శాఖ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం తమ బ్రాంచ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. రామాపురం రోడులో ఉన్న బ్యాంకును రాయచోటి మిస్సా చర్చి వద్ద నిర్మించిన భవనంలోకి మారుస్తున్నట్లు తెలిపారు. 26వ తేది సోమవారం నుంచి నూతన భవనంలో సేవలు కొనసాగుతాయని, ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. పాడి పశువులు, గొర్రెలు పెంచుకునే వారికి రుణాలు ఇస్తున్నామని తెలిపారు.

'లిప్' పద్ధతిపై ప్రత్యేక దృష్టి సారించాలి

లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 22: విద్యార్థులల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకే అమలు చేస్తున్న లిప్ పద్ధతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని రాయచోటి డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని దిన్నెపాడు పర్వతరెడ్డిగారి పల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ప్రాంతాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకుడు రాజేంద్రప్రసాదు, ఎంఈఓలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 22: మండలంలోని అయ్యలరాజుపల్లి హరిజనవాడలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న జెడ్డా సుబ్బరాయుడు, వెన్నెముక సమస్యతో బాధపడు తున్న యామల శివయ్యకు ఒక్కొక్కరికి రూ. 15 వేల చొప్పున ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటామని బాధిత కుటుంబసభ్యులకుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో గద్దె పెంచలయ్య, చింతు రాజారెడ్డి, వంకన శివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నాదెండ్ల గౌరయ్య, కొప్పుల పాండురంగనాథ్, వేణుగోపాల్‌రెడ్డి, ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న ముక్కా సాయి వికాస్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లెలో హెచ్‌ఐవీపై కళాజాతా

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో గురువారం కళాజాతా నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను వెలివేయకుండా, ఆదరించి ఆదుకోవాలన్నారు. ఎయిడ్స్ కలిసి తినడం, కలసి ఉండడం వల్ల సంభవించదని పాటల రూపంలో వివరించారు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

గాలివీడు, ఫిబ్రవరి22: మండలంలోని 44 పోలింగ్ బూత్‌లో మౌలిక వసతులు కల్పించాలని రాయచోటి ఆర్డీవో రంగస్వామి గురువారం సిబ్బందికి సూచించారు. మండలంలో 22 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అవసరమైన అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. భవనాలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితరాలను పరిశీలించి సూచనలు చేశారు. ఆర్డీవో వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ తిమ్మారెడ్డి, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్డీవో రంగస్వామి

సీతారాముల కల్యాణం, రథోత్సవాలను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 22: ఈ నెల 28న పట్టణంలోని అభి కన్వెన్షన్ హాల్‌లో జరిగే భద్రాద్రి సీతారాముల రథోత్సవం, కల్యాణోత్సవాలను జయప్రదం చేయాలని అభి, సుధ, లయ కల్యాణ మండపాల అధినేత బెల్లం రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన పట్టణంలోని అభి కన్వెన్షన్ హాల్‌లో ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం దేవస్థానం వారిని సంప్రదించడంతో రాయచోటిలో భద్రాద్రి రాముడి కల్యాణం చేసేందుకు అంగీకరించారన్నారు. ఈ నెల 27న నమూనా మూల విరాట్ విగ్రహాలున్న రథం రాయచోటికి వస్తుందన్నారు. 28వ తేదీ వచ్చిన భక్తులకు స్వామి వారిని దర్శించుకునే విధంగా ప్రత్యేకమైన క్యూలైన్లు కూడా ఏర్పాటు చేశామన్నారు. అన్న ప్రసా దం కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రచార రథం తిరుగుతోందని, అక్కడ పాస్‌లను అందజేస్తున్నామని, కావాల్సిన వారు తమ వివరాలు తెలియజేసి పాసులు పొందవచ్చునని తెలియజేశారు.

ఏపీఎండీసీ కార్మిక సమస్యలపై 9న చర్చలు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి22 : ఏపీఎండీసీలో పనిచేస్తున్న ట్రైనీ, అవుట్‌సోర్స్ కార్మికుల సమస్యలపై మార్చి 9న చర్చలకు హాజరు కావాలని యాజమాన్యం సూచించినట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. విజయవాడలోని ఏపీఎండీసీ హెడ్ ఆఫీసులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎండీ వెంకటరెడ్డిని కలిసినట్లుగా కార్మిక పోరాట కమిటీ కన్వీనర్ వెంకటేష్ తెలిపారు. సమాన పనికి సమాన వేతనం లో లోటు పాట్లు పరిష్కరిస్తామని మంగంపేట బ్రాంచ్‌కు ఏపీఎండీసీ ఎండీ లెటరు పంపినట్లు తెలిపారు.





ఐఐటీ స్నాతకోత్సవంలో డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణతో కలిసి విద్యార్థులకు పట్టాలందజేస్తున్న ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ సజ్జన్ జిందాల్

అద్వితీయ విద్యాసంస్థ
తిరుపతి ఐఐటీ

● స్నాతకోత్సవంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్




ఐఐటీ స్నాతకోత్సవంలో వర్చువల్ పద్ధతిలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రసంగం

ఏర్పేడు, ఫిబ్రవరి 22 : ఓవైపు శ్రీవెంకటేశ్వర స్వామి, మరోవైపు శ్రీకాళహస్తీశ్వర స్వామి వార్ల ఆశీస్సులు పొందుతున్న తిరుపతి ఐఐటీ దేశంలోని మిగిలిన ఉన్నత విద్యా సంస్థలతో పోలిస్తే అద్వితీయ విద్యా సంస్థ అని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కొనియాడారు. తిరుపతి జిల్లాలోని ఏర్పేడు సమీపంలో వున్న తిరుపతి ఐఐటీ 4వ మరియు 5వ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆయన ఢిల్లీ నుంచీ వర్చువల్ విధానంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యువ విద్యార్థులకు నాణ్యమైన, అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో మోదీ ప్రభుత్వ నిబద్ధతకు ఐఐటీలే నిదర్శనమన్నారు. ఆరోగ్యకరంగా ఎదిగే ప్రక్రియలో తిరుపతి ఐఐటీ నిస్సందేహంగా ఒక ప్రధాన లబ్ధిదారని మంత్రి అభివర్ణించారు. స్వల్ప వ్యవధిలోనే తిరుపతి ఐఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ సాధించిందని, అలాగే ఐఐటీ నవవిష్కార్, ఐ హబ్ ఫౌండేషన్ వంటివి ఏర్పాటు చేయడంలో చొరవ చూపిందని ప్రశంసించారు. తిరుపతి ఐఐటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రధానంగా స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, ఈవీ టెక్నాలజీస్ వంటి అంశాలపై దృష్టి సారించిందని, దేశంలోని పట్టణ రవాణా రంగంలో పెరుగుతున్న అవసరాలను తీర్చడంలో తిరుపతి ఐఐటీకి చెందిన ఈ విభాగాలు గేమ్ ఛేంజర్ కాబోతున్నాయన్నారు. స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ టెక్నాలజీస్, ప్రిసెషన్ అగ్రికల్చర్ రంగాల్లో తిరుపతి ఐఐటీ దృష్టి సారించాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. తిరుపతి ఐఐటీ బాలికలు ఎంచుకుంటున్న ప్రధాన గమ్యస్థానంగా మారడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని ఇతర ఐఐటీల కంటే ఇక్కడే ఎక్కువ సంఖ్యలో బాలికలు చదువుకుంటున్నారని, ఇది నారీ శక్తికి నిదర్శనమన్నారు. నారీ శక్తి వందన్ అధినియమ్ అనేది తమ ప్రభుత్వ నిర్ణయమని, లోక్‌సభలోనూ, రాష్ట్రాల అసెంబ్లీల్లోనూ మూడొంతుల సీట్లు మహిళలకు రిజర్వు చేయడం అందులో భాగమేనన్నారు. నిర్ణయాత్మక శక్తిగా మహిళలను అభివృద్ధి పరచడమే దాని ఉద్దేశమన్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా మహిళల్లో నాయకత్వ లక్షణాలను పెంచే దిశగా ఐఐటీల నుంచీ వెలుపలికి వచ్చిన విద్యార్థినులు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. స్నాతకోత్సవం సందర్భంగా పట్టభద్రులవుతున్న రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన మంత్రి విద్యార్థుల ఈ ప్రయాణంలో కీలక పాత్ర పోషించిన తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. ఐఐటీ బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్, మరియు జిందాల్ స్టీల్ వర్క్స్ సంస్థ చైర్మన్ సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అతిథిగా రావడం సంతోషంగా ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు ప్రపంచస్థాయికి ఎదగాలని కోరారు. ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఐఐటీ పనుల ప్రారంభంలో ఈ ప్రాంతంలో తిరగడానికి భయపడేవారమని గుర్తు చేసుకున్నారు.విద్యార్థులకు సరిపడే కళాశాల భవనాలు, హాస్టల్ భవనాలు, లేబరేటరీలు, క్యాంటీన్లు, మీటింగ్ హాళ్లు, తరగతిగదులతో ప్రస్తుతం ఆహ్లాదకరమైన వాతావరణం కళాశాలలో ఉందన్నారు.పీఆర్వో చమన్ మెహతా, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా ఉంది



బీటెక్ ప్రోగ్రాంలో బెస్ట్ అకడమిక్ పెర్మార్మెన్స్ అవార్డు అయిన ప్రెసిడెంట్ మెడల్‌ను అమ్మానాన్నల సమక్షంలో అందుకోవడం ఆనందంగా ఉంది.ఐఐటీలో చేరిన మొదట్లో ఆహారపు అలవాట్లు, వాతావరణ మార్పుతో చాలా ఇబ్బంది పడ్డా.మెల్లిగా తిరుపతి వాతావరణానికి అలవాటు పడి చదువుకున్నా.

- సౌమిత్రో వ్యాపారి, ప్రెసిడెంట్ మెడల్ విన్నర్

నా కష్టానికి ఫలితం



పట్టుదల,కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చనే మాటను నిజం చేయడానికి చాలా కష్టపడ్డా.పట్టుదలతో చదువుకుని గవర్నర్ ప్రైజ్‌కు ఎంపికయ్యా. స్నాతకోత్సవంలో గవర్నర్ ప్రైజ్‌ను ఇంతమంది ప్రముఖుల సమక్షంలో అందుకోవడం సంతృప్తినిచ్చింది.

- ప్రభాత్ రెడ్డి లంకిరెడ్డి, గవర్నర్ ప్రైజ్ విన్నర్

575 మందికి పట్టాల ప్రదానం

స్నాతకోత్సవాలను పురస్కరించుకుని క్యాంపస్‌లో మొత్తం 575మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.ఐఐటీ డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణతో కలిసి సజ్జన్ జిందాల్ ఈ పట్టాలను అందజేశారు. బీటెక్ పూర్తి చేసిన 355 విద్యార్థులకు, ఎంటెక్ పూర్తి చేసిన 106 మంది విద్యార్థులకు, ఎమ్మెస్సీ ముగించిన 74 మందికి, ఎంఎస్ పూర్తి చేసిన 17 మందికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన 21 మందికి, డ్యూయల్ డిగ్రీ చేసిన ఇద్దరికి చొప్పున మొత్తం 575 మందికి పట్టాలు అందజేశారు. 2021-22 బ్యాచ్ 4వ స్నాతకోత్సవానికి సంబంధించిన మొత్తం బీటెక్ గ్రాడ్యుయేట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సౌమిత్రో వ్యాపారికి ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, లంకిరెడ్డి ప్రభాత్‌రెడ్డికి గవర్నర్ ప్రైజ్ లభించాయి. అలాగే 2022-23 బ్యాచ్ 5వ స్నాతకోత్సవానికి సంబంధించి బీటెక్ గ్రాడ్యుయేట్లలో అత్యుత్తమ ప్రతిభ చాటిన దేబాషీ దాస్ అనే విద్యార్థిని ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, నోబుల్ సాజి మాథ్యూస్‌కు గవర్నర్ ప్రైజ్ లభించాయి.





'నిజం గెలవాలి'లో భాగంగా గురువారం పులిచెర్ల మండలం పగడాలవారిపల్లెలో మునస్వామి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నారా భువనేశ్వరి - పులిచెర్ల మండలం కమ్మపల్లిలో వెంకటపతి నాయుడు చిత్రపటానికి నివాళులు - ఐరాల మండలం చింతగుంపలపల్లి గ్రామంలో ప్రకాష్ కుటుంబానికి చెక్ అందజేత




బంగారుపాళ్యం మండలం టేకుమంద గ్రామంలో వి.గోవిందయ్య గౌడ్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి - చిత్తూరులో సుజాతమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

జడ్పీ సీఈవోగా గ్లోరియా బాధ్యతల స్వీకరణ



జడ్పీ సీఈవో గ్లోరియాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభాకర్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 22: ఉమ్మడి చిత్తూరు జిల్లాపరిషత్ ముఖ్యప్రణాళికాధికారిణిగా (సీఈవో) గ్లోరియా గురువారం సాయంత్రం ప్రస్తుత ఇన్‌చార్జి సీఈవో ప్రభాకర్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆమెను డీపీఆర్సీ కోఆర్డినేటర్ ఐఆర్ షణ్ముగరామ్‌తో పాటు జడ్పీలోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు ఆమె కలెక్టర్ షన్మోహన్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

చెన్నై ఎయిర్‌పోర్టులో చిత్తూరు మహిళ అరెస్టు

● 68 సిమ్ కార్డులు స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 22: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో చిత్తూరు జిల్లాకు చెందిన రోజా(40)ను పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 68 సిమ్ కార్డులు స్వాధీనం చేసుకుని, విచారణ జరుపుతున్నారు. గురువారం చెన్నై నుంచి దుబాయ్‌వెళ్లే విమానం ఎక్కుతున్న ప్రయాణికుల లగేజీలను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేస్తుండగా ఇవి బయటపడ్డాయి. సిమ్‌కార్డుల గురించి ప్రశ్నించగా, ఎయిర్‌పోర్టులో ఒక అపరిచిత వ్యక్తి దుబాయిలో ఒక మహిళకు అందజేయమంటూ బ్యాగు ఇచ్చారని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఆమెను అరెస్టు చేశారు.

దాడి చేస్తే తూతూమంత్రంగా కేసులా..?

● జాటీతో కొట్టుకుంటూ టీడీపీ నేత వినూత్న నిరసన



జాటీతో కొట్టుకుంటున్న నిరసన తెలుపుతున్న టీడీపీ నేత

గుడిపాల, ఫిబ్రవరి 22: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడి చేసి ఐదు రోజులు గడుస్తున్నా తూతూ మంత్రంగా కేసులు పెట్టి ఒకరిని అరెస్టు చేసి, మిగిలినవారిని ఇంకా అరెస్టు చేయక పోవడం దౌర్భాగ్యమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. దీనికి నిరసనగా గురువారం గుడిపాల మండలం సియోన్‌మలై చర్చివద్ద తనను తానే జాటీతో కొట్టుకుంటూ చంద్రమోహన్ నిరసన తెలిపారు.

మీడియాపై దాడులు హేయం: చింతా

కుప్పం:రాష్ట్రంలో మీడియాపై జరుగుతున్న దాడులు హేయమని కాంగ్రెస్ నేత, తిరుపతి మాజీ ఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. కుప్పంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను, లోపాలను ఫొటోలు సహా ఎత్తిచూపడం పత్రికాస్వేచ్ఛలో భాగమన్నారు. ఈ వాస్తవాలను జగన్‌రెడ్డి భరించలేకున్నారన్నారు. అందులో భాగంగానే ఈ దాడులు చేస్తున్నారన్నారు. వీటిని చూస్తుంటే బీహారులో ఉన్నామా అని అనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

పులిపిరికి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

చిత్తూరు జిల్లా : ఫిబ్రవరి 22: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. చిత్తూరు జిల్లా, తిరుపతిలో, రామానుజా సర్కిల్, తిరుచానూర్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ పైన, హోటల్ మీనాక్షి నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరి నైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. శుక్ర, శని రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

చిత్తూరు అపోలోలో జర్మనీ యూనివర్సిటీ కార్యాలయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఇంగ్ బ్రెన్డ్ మార్కర్ట్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 22: చిత్తూరులోని అపోలో మెడికల్ కళాశాలలో జర్మనీలోని ఆర్‌డబ్ల్యూటీహెచ్ యూనివర్సిటీ కార్యాలయాన్ని గురువారం ఆ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ ఇంగ్ బ్రెన్డ్ మార్కర్ట్ ప్రారంభించారు. ఈ కార్యాలయం ద్వారా విద్యార్థులకు విదేశీ విద్యకు సంబంధించి పరిజ్ఞానం పెంచుకోవచ్చన్నారు. ఇంటర్న్‌షిప్, రీసెర్చ్ గురించీ ఇక్కడ తెలుసుకోవచ్చన్నారు. ఈ సంస్థ ద్వారా భారత్‌లో ఉన్న విద్యార్థులకు ఉద్యోగావకాశాలతో పాటు పరిశోధనలకూ ఎంతో ఉపయోగమని అపోలో వైస్ చాన్సలర్ వినోద్ భట్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి, డీన్ సునీల్, డాక్టర్లు సందీప్, రాజ్‌వెంకట్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



రాజుపేట సమీపంలో హంద్రీ-నీవా కాలువ వద్ద కలెక్టరు

రామకుప్పం/శాంతిపురం, ఫిబ్రవరి 22: కుప్పం నియోజకవర్గంలో సీఎం జగన్ సోమవారం పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను గురువారం ఎంపీ రెడ్డెప్ప, కలెక్టరు షన్మోహన్ పరిశీలించారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువను, హెలిపాడ్ స్థలాన్ని చూశారు. అనంతరం శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లెలో సభాస్థలిని, హెలిప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లను వారు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, సీఎం పర్యటనలో భాగంగా తొలుత రాజుపేట వద్ద హంద్రీ-నీవా జలాలను విడుదల చేయనున్నారు. దీని కోసం కాలువ బ్రిడ్జి వద్ద గేట్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. దీనికోసం గురువారం ఉదయం నీటిని వదలగా, సాయంత్రానికి వర్థికుప్పం చేరుకున్నాయి. వర్థికుప్పం నుంచి రెండు చోట్ల అడ్డుకట్టలు వేసి నీటిని నిల్వ చేస్తున్నారు. సీఎం వచ్చేసరికి రాజుపేట వద్ద కాలువ నిండా నీళ్లుండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పాత పెన్షన్ ఇచ్చేవాళ్లకే ఓటు : యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 22: పాత పెన్షన్ ఇచ్చే పార్టీకే ఓటు వేయాలని యూటీఎఫ్ తీర్మానం చేసింది. గురువారం చిత్తూరులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నేతల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొని దిశానిర్దేశం చేశారు. సీపీఎస్, జీపీఎస్ విధానాలు కార్పొరేట్ సంస్థలకు లాభాలు ఇచ్చేవని, కేవలం పాత పెన్షన్ విధానమే ఉద్యోగులకు లాభదాయమన్నారు. పాత పెన్షన్ అమలు చేసే వారికే ఓటు వేయాలని తీర్మానం చేశారు. గతంలో పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని తీసుకొచ్చిన కాంగ్రెస్.. మిగిలిన రాజకీయ పార్టీల రాష్ట్రాల్లోనే ప్రజా పోరాటానికి ఓపీఎస్ విధానం తిరిగి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 14 వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలలు భవిష్యత్తులో కొనసాగించడం కష్టతరమవుతుందన్నారు. రాష్ట్ర కార్యదర్శి రమణ మాట్లాడుతూ 14 సంవత్సరాలు పోరాడి అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకున్నామని, ఇప్పుడు 2024 డీఎస్సీలో తిరిగి అప్రెంటిస్ విధానం ప్రవేశపెట్టడం సరికాదన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, మునిరత్నం, రెహనాబేగం, రెడ్డెప్ప, దీనావతి, బాషా, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

టికెట్లు కావలెను

● కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తులు



ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తులు ఇస్తున్న దృశ్యం

నగరి, ఫిబ్రవరి 22: నగరి పట్టణానికి చెందిన బాబు, రాకేష్‌రెడ్డి, అమ్ములు కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ల కోసం గురువారం విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో దరఖాస్తులు అందించారు. జిల్లా కాంగ్రెస్‌పార్టీ తరపున చిత్తూరు పార్లమెంటు అభ్యర్థిగా రాష్ట్ర పీసీసీ కార్యదర్శి బాబు, నగరి అసెంబ్లీ స్థానానికి రాకేష్‌రెడ్డి, గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం అమ్ములు స్థానిక నాయకులతో కలిసి ఈ దరఖాస్తులు అందించారు. నగరి దళితవాడకు చెందిన బాబు విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్‌పార్టీ మద్దతుదారుగా, మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డి శిష్యుడిగా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. నగరి మున్సిపల్ తొలి వైస్‌చైర్మన్‌గా ఎంపికైన ఈయన ప్రస్తుతం పీసీసీ కార్యదర్శిగా ఉన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708, 9703618705, 9703618710, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED
శ్రీ లక్ష్మీరమణ ఆటోమోటివ్స్, ఐషర్ ట్రాక్టర్ డీలర్‌షిప్, తిరుపతి నందు పనిచేయుటకు సేల్స్‌మెన్స్ క్రింది మండలాల నుండి వెంటనే కావలెను. పుత్తూరు, నగరి, పాకాల, పులిచెర్ల, ఎర్రవారిపాళెం, ఏరియాలలో ఆకర్షణీయ జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. సెల్ : 88866 88581, 88866 88582.
AJT - 179630

WANTED
రేణిగుంటలో 150 అడుగుల రోడ్డుకి అనుకొని 30x40 = 33.33 అంకణాలలో ఇల్లు కట్టించి ఇవ్వబడును. 55 లక్షల రూపాయలు మాత్రమే & ప్లాట్లు కూడా అమ్మబడును. 99660 66111
AJT - 6122

WANTED
Wanted Staff (Male & Female) Qualification B Pharmacy & Diploma (attractive salary) SV Apollo Pharmacy , Reddy & Reddy Colony. Cont: 82474 14838
AJT - 179573

FLATS FOR RENT
3 BHK & 2BHK Flats Are Available For Rent In Karakambadi Road Tirupathi With Latest Aminities & Cupboards Car Parking 24 Hrs Water Facility Etc & as aer Vasthu Cont : 98482 26551.
AJT - 1711

PLOTS FOR SALE
Open Plots for sale in Dwarakamai 1 Layout East Face 5 Plots, Near to Renigunta Airport, Tirupati. Dixon backside. For Layout Plots and Commercial Plots .Contact: 63022 11738.
AJT- 6093

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బులో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 176964

CHANGE OF NAME
I, Thiruvani (Old Name) R/o D.No 18-3-60/D14, Flat No 104, Swarna Residency, A Block, Shanthi Nagar, Tirupati Town & Dt AP have changed my name to KOLLA TRIVENI (New Name).
AJT - 6121

CHANGE OF NAME
I, Krishnasetty Dillibabu S/o Krishnasetty Chettiyar (Old Name) R/o D.No. 5-141-B, Saraswathi Nagar, M R Palli, Tirupati Dt, AP. India. I have changed my name as KRISHNAPASETTY DILLIBABU S/o Krishnappa Chettiyar (New Name) old PPT No V3147097.
AJT - 1729

CHANGE OF NAME
I, ROHINI RANGAN (Old Name), W/o T.V.KASTURI RANGAN, residing at D.No. 4-1125/11,Gayathri Nagar, Greamspet, Chittoor,Chittoor District, AP Pin-517001 hereby declare that I have changed my name as KASTURI ROHINI RANGAN (New Name) for all purposes
AJT - 4405

హైవే ఫ్లాట్స్
రేణిగుంట to కడప హైవేకి శెట్టిగుంట దగ్గర హైవే వెంబడి 41.66 అం. కేవలం 6,67,000 రూ.లకే 5,87,000 రూలకే పూర్తి డెవలప్మెంట్‌తో భూమిపై పెట్టుబడి మీ పిల్లలకు బంగారు భవిష్యత్తు సం.ప్ర. 95023 75369
AJT-179915

DISTANCE EDUCATION
B.A., B.Com (Gen/Comp. Sci), B.Sc, Poly Diploma, B.Tech, M.Tech, MBA (ALL) కోర్సులందు Lateral Entry (Discontinue / Failed Students UGC గుర్తింపు పొందిన యూనివర్సిటీ ద్వారా పై కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం. వివరములకు సం.ప్ర.: 82474 57565
AJT-6117

FINANCE
Govt. ఎంప్లాయిస్‌కు, రిటైర్ పెన్షనర్లకు వాయిదా పద్ధతిలో గాని, నెలవారీ వడ్డీ పద్ధతిలో గాని 50 వేల నుండి 5 లక్షల వరకు ఫైనాన్స్ ఇవ్వబడును. సిబిల్ స్కోర్ అవసరం లేదు, J.K అసోసియేట్ సర్వీసెస్. GRN:136/2009. Cell: 9666547338.
AJD:177159

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ CLASSIFIEDS

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

తేనెకొండ సమీపంలో మామిడితోట దగ్ధం



దగ్ధమైన మామిడితోట

కురబలకోట, ఫిబ్రవరి 22: మండలంలోని కురబలకోట పంచాయతీ తేనెకొండ సమీపంలో మామిడితోట దగ్ధమైన సంఘటన గురువారం జరిగింది. దీనికి సంబంధించి బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కురబలకోటకు చెందిన అంజికుమార్ తేనెకొండ సమీపంలోని తనకున్న 5ఎకరాల పొలంలో మామిడి, అల్లనేరేడు చెట్లను నాటి తోటను పెంచాడు. వాటి వయస్సు 15ఏళ్లు ఉంటుంది. అయితే కొంత మంది తోటకు పక్కనే ఉన్న కొండకు నిప్పటించారు. అది కాలుకుంటూ వచ్చి కొండకు ఆనుకుని ఉన్న తోటను అంటుకోవడంతో పూర్తిగా కాలిపోయింది. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపుగా 150 చెట్లకు పైగా కాలిపోయాయి. దీంతో దాదాపుగా భారీగా ఆస్థినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తమను ఆదుకుని న్యాయం చేయాలని బాధితుడు కోరాడు.

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం ఇద్దరు నిందితుల అరెస్టు

ములకలచెరువు, ఫిబ్రవరి 22: మండంలోని వేపూరికోట సమీపంలో గురువారం దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కృష్ణప్ప(45), దస్తగిరి(42)లను అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి పది కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ములకలచెరువు, ఫిబ్రవరి 22: మండలంలోని గూడుపల్లె సమీపంలో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రూ.6,410 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బి.కొత్తకోటలో 27 మంది బైండోవర్

బి.కొత్తకోట, ఫిబ్రవరి22: బి.కొత్తకోట మండలంలో వివిధ కేసులలో నిందితులుగా ఉన్న 27 మందిని గురువారం స్థానిక తహశీల్దార్ పుణ్యవతి ఎదుట హాజరు పరచి బైండోవర్ చేసినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. వారందరూ కర్ణాటక మద్యం రవాణా, విక్రయం, పేకాట, కోడిపందేలు తదితర కేసులలో నిందితులు అయినందున మళ్లీ ఎలాంటి నేరాలు చేయకూడదని, ముందస్తుగా వారిని బైండోవర్ చేశామని ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 22: ప్రజాస్వామ్యంలో ఓటు కలిగిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని వన్ టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువక కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామజ్యోతి సొసైటీ సుభద్ర, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు వనజ, యాస్మిన్, విష్ణుప్రియ, ఖాజావలి, వెంకటశివ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు

పెద్దమండ్యం, ఫిబ్రవరి 22: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. పెద్దమండ్యం మండల కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం ఇంటర్ సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామాంజులునాక్, హెచ్ఎంలు రషీదాబాను, రవిచంద్ర, అధ్యాపకులు ముస్తఫా, రవీంద్ర, వెంకటస్వామి, శీను, చిన్న, వినాయకరెడి, మాజీ సర్పంచ్ విజయకుమార్‌స్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఉత్తీర్ణత సాధించండి



సరస్వతి పూజ చేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

కలకడ, ఫిబ్రవరి 21:ప్రతి విద్యార్థి కష్టపడి చదివి పదో తరగతి పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించాలని ఎంఈవో మునీంద్ర నాయక్ అన్నారు. గురువారం ఆదర్శ పాఠశాల్లో పదో తరగతి వీడ్కోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్య నభ్యసిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అలాగే పలువురు వక్తలు విద్యార్థులకు సలహాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, ప్రిన్సిపాల్ మలాంషావలి, హెచ్ఎం చెంగలరాయులు, శ్రీధర్, శంకరయ్య, కిర్మయి, మస్తాన్‌లు పాల్గొన్నారు.



నారా భువనేశ్వరికి ఘనస్వాగతం



భువనేశ్వరిని కలసిన మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి, శ్రీరామ్‌చినబాబు, మార్పూరి సుధాకర్‌నాయుడు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 22: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం మదనపల్లెలో టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె వారి ఆప్యాయంగా పలకరించారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా బుధవారం రాత్రి చిత్తూరు జిల్లా పుంగనూరు నుంచి మదనపల్లెకు వచ్చిన ఆమె స్థానిక టీకేఎస్ గార్డెన్స్‌లో ప్రత్యేక బస్సులో బస చేశారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం బస్సు దిగిన భువనేశ్వరిని మదనపల్లె టీడీపీ నాయకులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి మర్యాదపూర్వకంగా కలసి ఫొటోలు దిగారు. మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేశ్ తన కుటుంబ సభ్యులతో కలసి భువనేశ్వరిని కలిశారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, టీడీపీ సీనియర్ నేత మార్పూరి సుధాకర్‌నాయుడు భువనేశ్వరికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి మర్యాదపూర్వకంగా మాట్లాడారు. మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్ తులసి రామకృష్ణ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు భువనేశ్వరిని కలసి ఆప్యాయంగా పలుకరించారు. మాజీ ఎమ్మెల్యే రాటకొండ శోభమ్మ, శ్రీరామనేని జయరామనాయుడు, ఆర్.గురుప్రసాద్, నీలకంఠ, ఎస్ఏ మస్తాన్, పర్వీన్‌తాజ్, దొరస్వామినాయుడు, పి.సురేంద్రయాదవ్ తదితరులు భువనేశ్వరిని కలసి నిజం గెలవాలి యాత్ర విజయవంతం కావాలని ఆకాక్షించారు.

కేవీపల్లె నుంచి టీడీపీలో భారీగా చేరికలు



కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన తువ్వపల్లె గ్రామస్థులు

కలికిరి, ఫిబ్రవరి 22: కేవీపల్లె మండలంలోని తువ్వపల్లె పంచాయతీ నుంచి భారీగా సంఖ్యలో టీడీపీలో చేరారు. కలికిరి మండలంలోని నగరిపల్లె గ్రామంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సమక్షంలో గురువారం 60 కుటుంబాలకు చెందిన వారు టీడీపీ చేరుతున్నట్లు ప్రకటించారు. కిశోర్‌కుమార్‌రెడ్డి వారందరికి పసుపు కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను గ్రామాల్లో ప్రజలు కూడా గమనించి వైసీపీని చీదరించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. కొత్తగా చేరిన వారందరికీ సముచిత స్థానముంటుందని, పాత కొత్తల సమన్వయంతో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని ఆయన కోరారు. కేవీపల్లె మండల టీడీపీ అధ్యక్షురాలు గీతమ్మ, నాయకులు సుధాకర్ నాయుడు, ఇరగం రెడ్డి, రమణ, రెడ్డెప్ప రెడ్డి, రెడ్డిశేఖర్, రాజశేఖర్ ఆధ్వర్యంలో సి.రవి, వెంకటేశు, బి.వెంకట్రమణ, ఎన్.వెంకట్రమణ, శివకుమార్, శివప్రతాప్, శివయ్య, మల్లికార్జున, ఆనంద, బి.రవి, శ్రీరాములు, సిద్దరామయ్య, రామచంద్ర, వెంకట్రమణా రెడ్డి, రామకృష్ణ, భద్రయ్య, నాగరాజ, ఈశ్వరయ్య, వెంకటేశ్వర, అంజినేయులు, నరసింహా, నాగరెడ్డి, జగన్నాథ రెడ్డి, రామచంద్ర నాయుడు, కేశవ, కల్యాణ్, మహేష్, రమణ, ఇరగం రెడ్డి, రాజశేఖర్, రామనాథ నాయుడు, వెంకట్రమణ నాయుడు, నాగరాజ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు, మల్లికార్జున, సత్యం రెడ్డి, రఘునాథ రెడ్డి, నరసింహులు, అంజనేయులు, రాజేంద్ర, సి.నాగరాజ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

కార్యకర్తల సంక్షేమం పట్టించుకున్న ఏకైక పార్టీ టీడీపీ

పీలేరు, ఫిబ్రవరి 22: కార్యకర్తల సంక్షేమం గురించి పట్టించుకున్న ఏకైక పార్టీ తెలుగుదేశం మాత్రమేనని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీలేరు మండలంలో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించి పలువురు కార్యకర్తలు, నాయకులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే కార్యకర్తల కోసం సంక్షేమ నిధి, జీవిత బీమా ఏర్పాటు చేసిన ఘనత టీడీపీదేనన్నారు. అధికారం ఉన్నా, లేకపోయినా కార్యకర్తల గురించి పట్టించుకోవడం చంద్రబాబు నాయుడు కుటుంబసభ్యులకే చెల్లిందన్నారు. అంతకు మునుపు ఆయన ఇటీవల భార్యావియోగం పొందిన ఇందిరమ్మ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు మునాఫ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. అదే కాలనీలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి పట్టునే ఉంటున్న టీడీపీ కార్యకర్త అబ్బవరం భాస్కర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డప్పరెడ్డి, వెంకటేశ్, రియాజ్, ప్రసాద్, హనీఫ్, షౌకత్ అలీ, పురుషోత్తం రెడ్డి, కంచి సూరి, ఖాజాపీర్, సుబ్బయ్య, ఖాజా, శ్రీనాథరెడ్డి పాల్గొన్నారు.

సీటీఎం జాతరను విజయవంతం చేయండి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22: మండలంలోని సీటీఎం గ్రామంలో వెలసిన నలవీరగంగాభవాని జాతరను విజయవంతంచేయాలని ఆలయకమిటీ సభ్యులు, సీటీఎం సర్పంచ్ సగినాల ఆనందపార్థసారథి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక నలవీరగంగాభవాని ఆలయంలో మీడియాతో వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి నిర్వహించే సీటీఎం గంగజాతర కోసం ఇప్పటికే ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జాతరకు వేలాదిగా తరలివచ్చే భక్తులకు అసౌకర్యం లేకుండా మౌలిక వసతులు కల్పించనున్నామని చెప్పారు. అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు విశేషపూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సగినాల ఆనందపార్థసారథి, వెలుగు చంద్ర, పారపట్ల సురేంద్రరెడ్డి, పోగాకు వీరప్రతాప్‌లు పాల్గొన్నారు.

ఉచితంగా డీఎస్సీ స్టడీ మెటీరియల్ పంపిణీ



జిల్లా గ్రంథాలయంలో ఉచితంగా డీఎస్సీ స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22: స్థానిక జిల్లా గ్రంథాలయంలో గురువారం చిత్తూరు కుట్టిడీఎస్సీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వాహకులు డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మధుబాల, మదనపల్లె గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి ఆధ్వర్యంలో ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. డీఎస్సీ అభ్యర్థులు టెట్‌మార్కులు, టెట్ డీఎస్సీ ఆన్‌లైన్ అప్లికేషన్, రెండు ఫొటోలు తీసుకొచ్చిన వారికి చిత్తూరు కుట్టి డీఎస్సీ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ పవనకుమారి ఉచిత డీఎస్సీ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లీం మైనారిటీ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అర్హత, ఆసక్తి ఉన్న మైనార్టీ విద్యార్థులు స్థానిక జిల్లా గ్రంథాలయంలో సంప్రదించాలన్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు పడుతున్ననిరుద్యోగ యువతకు సాయం చేయాలని ఈ కార్యక్రమం చేపట్టినట్లువారు తెలిపారు.

డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ప్రసాదరెడ్డి



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 22: మదనపల్లె డీఎస్పీగా ప్రసాదరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన కేశప్ప పదోన్నతిపై బదిలీ కాగా, ఆయన స్థానంలో అనంతపురం నుంచి ప్రసాదరెడ్డి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడటంతో పాటు, సంఘ విద్రోహులపై కన్నేసి నేరాలను అదుపు చేస్తామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెడతామని, ప్రజలు సహకరించాలని ప్రసాదరెడ్డి పేర్కొన్నారు.

తాగునీటి సరఫరా బిల్లులు చెల్లించరా?

● మండల సమావేశంలో నిలదీసిన సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

కలికిరి, ఫిబ్రవరి 22: నాలుగేళ్ళు కావస్తున్నా తాగునీటి సరఫరా బిల్లులు చెలించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన గురువారం కలికిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడిన సర్పంచులు, ఎంపీటీసీలు ప్రభుత్వ అలసత్వాన్ని ప్రశ్నించారు. అధికారులు సైతం చొరవ తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. గుట్టపాలెం సర్పంచు వెంకట రెడ్డి మాట్లాడుతూ తీవ్రస్థాయిలో కరువు నెలకొన్న 2020లో గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశామని అప్పట్లో మండలంలో ప్రజల వత్తిడిని తట్టుకోలేక అధికారులు తమను బతిమాలి తాగునీటిని ట్యాంకర్ల ద్వారా తోలించారని తెలిపారు. ఏప్రిల్, మే నెలల వరకూ బిల్లులు చెల్లించారని, ఆ తరవాత ఆ ఏడాది ఆఖరు వరకూ తోలిన ట్యాంకర్ల బిల్లులు పెండింగ్ వుంచడం దారుణమన్నారు. ఒక దశలో పలువురు సభ్యులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎంపీడీవో రామకృష్ణయ్య జోక్యం చేసుకుని సరఫరాదార్లకు రావలసిన బకాయిలను చెల్లించేందుకు ఇంజినీర్లు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీపీ నూర్జహాన్, ఎంపీడీవో రామకృష్ణయ్య మాట్లాడుతూ వేసవి కాలం మొదలవుతున్న దృష్ట్యా గ్రామాల్లో త్రాగునీటికి కొరత రాకుండా ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీటీసీ పద్మజ, తహసీల్దారు విజయకుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరయ్యారు.


ఘనంగా వరల్డ్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డే



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 22: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బెడన్‌పోవల్ జయంతి సందర్భంగా వరల్డ్ డ్రింకింగ్ డే వరల్డ్ స్కౌంట్స్ అండ్ గైడ్స్ డేని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానోదయ హైస్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కెప్రసాదరావు, డైరెక్టర్ భవానీ ప్రసాద్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, బుల్‌బుల్స్ ఉపాధ్యాయ బృంధం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కాటు పడేదాకా పట్టించుకోరా..?



సాయిబాబా నగర్‌లో దారిలో ఉన్న శునకాల సమూహం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 22: వాల్మీకిపురం పట్టణం వ్యాప్తంగా వీధి కుక్కల సంచారం రోజురోజుకు శృతిమించిపోతున్నాయి. దీంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. అడుగడుగునా వీధుల వెంబడి శునకాల సంఖ్య వందలకొద్దీ దర్శనమిస్తూ రోడ్లపై జనం తిరగాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలోని వీధులు మొదలు జాతీయ రహదారులపై కూడా వీధి కుక్కలు వాహనాలను, జనాలను వెంబడిస్తుండడంతో పాదాచారులు, వాహన చోదకులకు తిప్పలు తప్పడం లేదు. దారి కాచి వాహనవాలపైకి చొరబడుతుండటంతో అనేక సందర్భాలలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పట్టణంలో ఇప్పటికైనా శునకాల బెడద తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ ఈవో ప్రసాదరెడ్డిని వివరణ కోరగా ఇప్పటికే ప్రజల నుంచి ఫిర్యాదులు కూడా వచ్చాయని త్వరలోనే శుక నాల పట్టివేతపై తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

బెంగళూరులోని కొరిజో ఎడ్యుటెక్‌తో మిట్స్ ఒప్పందం



మిట్స్ ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

కురబలకోట, ఫిబ్రవరి 22: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల బెంగళూరులోని కొరిజో ఎడ్యుటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఎంవోయూ ఒప్పందం కుదుర్చుకునట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ రామనాథమ్. సీఎస్‌టీ విభాగాధిపతి, గంగాదేవీలు ఆ సంస్థ బిజినెస్ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ జయప్రణయ్‌లతో కలిసి ఒప్పంద పత్రంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్కడ ఇంటర్న్‌షిప్‌లు వర్క్‌షాప్‌పరిశ్రమలలో జరుగుతున్న నూతన టెక్నాలజీలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఈడీ కీర్తి, ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేశారు.

పెద్దమండ్యం ఏఎస్ఐగా మధుచారి

పెద్దమండ్యం, ఫిబ్రవరి 22: మండల ఏఎస్ఐగా చెన్నకేశవ గురువారం పదవీ బాధ్యతలు చేట్టారు. పీలేరు నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో. శాంతి భద్రతల కోసం ప్రజలు సహకరించాలన్నారు. .

సమష్టిగా పోరాడి చంద్రబాబును సీఎం చేద్దాం



ఇందిరమ్మ కాలనీ వాసుల సమస్యలు చూపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

వాల్మీకిపురం, ఫిబ్రవరి 22:టీడీపీ శ్రేణులు సమష్టిగా పోరాడి పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేద్దామని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం వాల్మీకిపురం ఇందిరమ్మ కాలనీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ జనసేన మేనిఫెస్టో సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలపై కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తామంతా ఎప్పటికీ నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి వెన్నంటే ఉంటామని, వచ్చే ఎన్నికల్లో పీలేరులో టీడీపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. రాష్ట్రంలో మళ్లీ నారా చంద్రబాబునాయుడు పరిపాలన కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం, పార్టీని రాష్ట్ర ప్రజలు తమ ఓటుతో తన్ని తరిమి కొట్టడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షు డు వెంకటరమణ, మాజీ ఎంపీపీలు సురేంద్రవర్మ, పీలేరు తెలుగు యువత ఉపాధ్యక్షుడు లంకిపల్లి మధు, మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు రాజేంద్రాచారి, పీవీ నాంరాయణ, వల్లిగట్ల వెంకటరమణ,చంద్రమౌళి, డిష్ బ్రదర్స్, కోసూరి రమేష్, స్వర్ణలత, మురళి, న్యాయవాది రమణ, కువైట్ సయ్యద్‌బాషా, బొక్కసం ఆనంద్, చాంను, రామాంజులురెడ్డి, సాదిక్, సర్దార్, మౌలా, సైదు, బషీర్, రమణ, అబ్బాస్, సయ్యద్, అమీర్, లోకేష్, మస్తాన్‌వలి, ఆదినారాయణ, రెడ్డిరామ్, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాబోయేది జనసేన-టీడీపీ ప్రభుత్వమే..



ప్రచారం చేస్తున్న మదనపల్లె జనసేన-టీడీపీ నాయకులు

మదనపల్లె, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో రాబోయేది జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వమేనని మదనపల్లె నియోజకవర్గ జనసేన నేతలు శ్రీరామ రామాంజినేయులు, దారం అనిత పేర్కొన్నారు. గురువారం మదనపల్లెలో 66వ రోజు ప్రతి ఇంటికి జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ...జనేసేన అధి నేత పవన్‌కళ్యాణ్ .20 కోట్ల రూపాయలను తన సొంత నిధులను పార్టీకి విరాళంగా ఇచ్చాడన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన-టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలందరికీ న్యాయం చేసేలా ప్రభుత్వ పాలన ఉంటుందన్నారు. కార్యక్రమంలో మదనపల్లె జనసేన నాయకులు శంకర, సోను, సుప్రీం, హర్ష, శ్రీనాథ్, ధరణి, వీర మహిళలు పద్మావతి, సుకన్య, లక్ష్మీ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లితే బీఎల్‌వోలదే బాధ్యత



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతన్న ఆర్డీవో హరిప్రసాద్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 22: ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లితే పూర్తి బాధ్యత బీఎల్‌వోలపై ఉంటుందని మదనపల్లి ఆర్డీవో హరిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధి కారులకు, బీఎల్‌వోలకు ఓటర్ల జాబితాపై ఏర్పాటు చేసి సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని తప్పలను సరిదిద్దాలని ఉన్నతస్థాయి అధికాలు ఆదేశాలు జారీచేసినా బీఎల్‌వోలకు మాత్రం చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. తుది జాబితా తయారు చేసేటప్పుడు మరణంచిన వారి ఓట్లను ఖచ్చితంగా తొలగించాలన్నారు. అలాగే 18ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కుకల్పించాలన్నారు. బీఎల్‌వోల గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. వారం రోజుల్లోగా గ్రామాల్లో పర్యటించి ఓటర్ల జాబితాలో తప్పలను సవరించాలని లేని పక్షంలో అటువంటి వారిని విధుల నుంచి తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం పోలింగ్ బూత్‌లపై ఆరాతీసి ఈవీఎంలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీవో మైతిలి, ఎంఈవోలు పద్మావతి, నారాయణ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ త్యాగం మరువలేనిది



ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మద్దిరెడ్డి తదితరులు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 22: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రాణత్యాగం మరువలేనిదని రెడ్డి సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు కనుగొండ మద్దిరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కేఎంఆర్ కాంప్లెక్స్ వద్ద రెడ్డి సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కంభం నాగభూషణరెడ్డి ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ 117 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మద్దిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన ఆయనను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మారెడ్డి, ప్రసాదరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో: తెలుగు గడ్డపై మొదటిసారిగా తెల్లదొరల పాలనపై తిరుబాటు ప్రదర్శించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవలు అద్వితీయమని వక్తలు పేర్కొన్నారు. గురువారం ఉయ్యాలవా వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీమ పౌరుషంతో బ్రిటీష పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడి అశువులుబాసిన నరసింహా రెడ్డి చరిత్ర చెరిగిపోనిదని ప్రశంసించారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యానారాయణరెడి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంల్లో, కార్యనిర్వాహకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించే వరకు మిల్లు వేలం వద్దు

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 22: మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు చెల్లించాల్సిన రూ.9 కోట్లు బకాయిలు చెల్లించాకే మిల్లును వేలం వేయవద్దని టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో కోరారు. సీటీఎం వద్ద ఉన్న మదనపల్లె స్పిన్నింగ్ మిల్లులో 314 మంది కార్మికులు 20 ఏళ్లపాటు సర్వీసు చేశారని గుర్తు చేశారు. 2014లో ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మిల్లును మూసి వేశారన్నారు. 2016లో టీఎన్‌టీయూసీ పోరాటంతో కర్ణాటక హైకోర్టు లిక్విడేటర్, ఆడిటర్ పరిశీలించి కార్మికులకు రూ.9 కోట్లు బకాయిలు చెల్లించాని నిర్థారించారన్నారు. కాని ఎల్‌ఆర్‌సీ సంస్థ 2022లో మిల్లు ఆస్తుల విక్రయానికి టెండర్ పిలిచినా వాయిదా పడిందన్నారు. ప్రస్తుతం ఈనెల 28వ తేదీన మిల్లును వేలం వేయడానికి టెండర్లు పిలిచారని, తమ బకాయిలు చెల్లించాకే వేలం వేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మికశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖలు రాశామన్నారు.

తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

బి.కొత్తకోట, ఫిబ్రవరి22: తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ నేత కొండా నరేంద్ర పేర్కొన్నారు. గురువారం బి.కొత్తకోటలోని కొండా ఎస్టేట్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని రైతుల శ్రేయస్సు కోసం ప్రత్యక్ష రాజకీయాలలోకి రావడం జరిగిందన్నారు. తన కుటుంబం మొదటినుంచి టీడీపీతోనే వుందని, గతంలో సైతం తాను తంబళ్లపలె అసెంబ్లీ, రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా రంగంలో దిగేందుకు ప్రయత్నించినా, అప్పటి పొత్తులు, రాజకీయ సమీకరణాల వల్ల సాధ్యపడలేదని, ఈ సారి తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థిగా జనసేన మద్దతుతో తాను బరిలో ఉంటానన్న ఆశాభావాన్ని నరేంద్ర వ్యక్తం చేశారు. వైసీపీ దౌర్జన్యాలను తిప్పి కొడతామని, రైతులు, టీడీపీ జనసేన కార్యకర్తల మద్దతుతో తంబళ్లపల్లె లో టీడీపీ జెండాను ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పీలేరు, ఫిబ్రవరి 22: రానున్న 2024-25 విద్యాసంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో లోకేశ్వర రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం మేరకు 1వ తరగతిలో 5 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారులకు అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశం లభిస్తుందని ఆయన తెలిపారు. సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలు, ప్రభుత్వ పేదరిక నిర్మూలన కార్యక్రమాల లబ్ధిదారులు, భూమి లేని వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలు మార్చి 14వ తేదీలోపు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

అంగళ్లులో వైభవంగా ఉరుసు

కురబలకోట, ఫిబ్రవరి 22: మండలంలోని అంగళ్లులో రెండు రోజుల ఉరుసు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. హజ్రత్ సయ్యదినా షేఖ్ అబ్దులాఖాధర్ జిలానీ పీరానెపీర్ గౌసుల్ అజం దస్తగీర్ ఉరుసులో భాగంగా గురువారం రాత్రి ఖవ్వాలి పలువురిని ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమానికి చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నబీసాబ్, రహంతుల్లా, బావాజాన్, హబీబ్, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు. కాగా బుధవారం గంధోత్సవ వేడుకలలో కడప ముతవల్లి రాస్తాని మగ్దుమ్ ముల్లాయి పాల్గొని ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు.